


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com




visit us @ http://epaper.suryaa.com

సంపుటి 17 | సంచిక 233

సోమవారం | 22 జూలై 2024 | హైదరాబాద్

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - శిశిర ఋతువు, ఆషాఢమాసం బహళ పాడ్యమి మ.2.43, శ్రవణం రా.1.03, వర్జ్యం ఉ.5.49 నుంచి 7.21 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.31 నుంచి 1.23 వరకు తిరిగి 3.07 నుంచి 3.59 వరకు

## నేటి నుంచి పార్లమెంట్
# బడ్జెట్ సమావేశాలు

- పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఇప్పటికే ఫిబ్రవరిలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన మోడీ సర్కారు
- 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా కేంద్రం బడ్జెట్
- కొత్త పద్దులో అభివృద్ధి, సంక్షేమాల మధ్య ప్రభుత్వం సమతూకం పాటించే ఆస్కారం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కాలుష్య తీవ్రతను తగ్గించడమే లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీ?



బడ్జెట్ సమావేశాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. బడ్జెట్ సమావేశాలకు సంబంధించి నిర్మలా సీతారామన్ నేతృఎత్వంలోని సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ బడ్జెట్‌పై పూర్తి స్థాయి కసరత్తులు చేసినట్లు తెలుస్తోంది.

వివరాలు లోపలి పేజీల్లో

## ఘనంగా ఉజ్జయినీ మహంకాళి
# బోనాలు

- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- బోనం సమర్పించిన సీఎస్
- మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆలయ పరిసరాల్లో నెలకొన్న సందడి



6 లో

సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. మహంకాళికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు ముఖ్యమంత్రికి వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మహాకాళి అమ్మవారిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

- అల్ప పీడన ప్రభావంతో భారీ వర్షాలు
- వరదలతో పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- మరో 3 రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి



2 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## జిల్లా కలెక్టర్లు
# అప్రమత్తంగా ఉండాలి


- గోదావరి ఉధృతిపై నిరంతర నిఘా పెట్టండి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



6 లో

2024 పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యతిరేక శక్తులన్ని బీజేపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు, కుట్రలు చేశాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు తొలగిస్తారని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

## బడ్జెట్ సమావేశాలకు ముందు అఖిలపక్ష భేటీ



6 లో

- కన్వార్ యాత్ర సహా పలు అంశాలపై చర్చ
- నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ జరగాలని పట్టు
- తృణమూల్ కాంగ్రెస్ తప్ప మిగతా పార్టీలన్నీ హాజరు
- ఒడిశాకి ప్రత్యేక హెూదా కావాలని బిజూ జనతాదళ్ డిమాండ్
- అదే బాటలో నితీష్ కుమార్ నడిచేలా ఉంది

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ కచ్చితంగా జరగాలని ఆయన పట్టుపట్టారు. వైసిపి తో పాటు జనతా దళ్ (యునైటెడ్), బిజూ జనతా దళ్ పార్టీల నేతలూ ఈ సమావేశానికి హాజరయ్యారు.

## పింఛన్ల పంపిణీపై
# చంద్రబాబు ఫోకస్

- పనులు ఉన్నా పక్కనబెట్టి ఒకటో తేదీ జరిగే పింఛన్ల పంపిణీకి వెళ్లండి
- ఎమ్మెల్యేలు, మంత్రులు విధిగా పాల్గొనాలని ఆదేశాలు
- పాలనపై పూర్తిస్థాయి పట్టుకు ఏపీ సీఎం వరుస నిర్ణయాలు
- ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను కూడా భాగం చేయాలి
- జిల్లా టీడీపీ కార్యాలయాలలో ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించాలి

వివరాలు-2లో



2 లో

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనపై ఫోకస్ పెట్టారు. వచ్చే ఐదేళ్లు మాత్రమే కాకుండా మరికొన్నేళ్ల పాటు ఏపీలో టీడీపీ ప్రభుత్వం కొనసాగేలా చంద్రబాబు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగా ప్రజలకు, నాయకులకు మధ్య బలమైన సంబంధాలు ఉండేలా చంద్రబాబు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## అంతా ఇంతే!




మమ్మీ.. మాలాగా డాడీకి కూడా యూనిఫాం వుందన్న మాట

## నోటికొచ్చినట్టు
# మాట్లాడొద్దు జగన్

- జగన్‌కు ఏపీ హోమ్ మినిస్టర్ అనిత హెచ్చరిక
- అన్ని అబద్ధపు లెక్కలు
- టీడీపీ అధికారంలోకి వచ్చాక కేవలం 4 హత్యలే జరిగాయి
- ఇందులో 3 టీడీపీ కార్యకర్తలు, నాయకులేనన్నారు



3 లో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నోటికి వచ్చినట్లు మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. సరైన వివరాలు, ఆధారాలు లేకుండా టీడీపీ ప్రభుత్వాన్ని అల్లరి చేసేందుకు, ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసేందుకు జగన్ ప్రయత్నిస్తే..అందుకు తగిన విధంగా మూల్యం చెల్లించాల్సి వస్తుందని వెల్లడించారు. ఆదివారమిక్కడ మీడియాతో అనిత మాట్లాడారు.

## నేటీ నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు



3 లో

- రెండో సమావేశాలపైనే ప్రజల ఆసక్తి
- సభలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లు ప్రవేశం
- వైసీపీ ప్రతిపక్ష హెూదాపై తర్జన భర్జన
- సాధారణ సభ్యునిగా సభకు జగన్
- సీట్ల కేటాయింపు లేకుండానే సభలు
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

## దేశ వ్యతిరేక శక్తులన్నీ
# ఏకం అవుతున్నాయి

- కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది
- ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా దేశాభివృద్ధి ఆగదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- మూడవ సారి గెలిచి చరిత్ర సృష్టించిన మోడీ

2024 పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యతిరేక శక్తులన్ని బీజేపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు, కుట్రలు చేశాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు తొలగిస్తారని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కార్యకర్తల విస్తృఎతస్థాయి సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు-6లో



# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు : అల్ప పీడన ప్రభావంతో భారీ వర్షాలు

అమరావతి : ఒడిశా తీరంలో అల్ప పీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. అల్పపీడనం వాయువ్య దిశలో కదిలి ఆదివారం ఉదయం ఒడిశా – ఛత్తీస్ గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురవనున్నాయి. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. విశాఖ, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో మోస్తరు వర్షాలు మిగతా చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు.

***గోదావరికి వరద :*** భారీ వర్షాలతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.2 అడుగులకు చేరగా.. 1800 క్యూసెక్కుల నీటిని డెల్టా కాలువకు విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదారి వరద ఉధృతికి దేవీపట్నం మండలంగండి పోచమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. అటు, అల్లూరి జిల్లాలో వర్షాలతో రాకపోకలు స్తంభించాయి. చట్టి వద్ద జాతీయ రహదారి – 30పైకి శబరి నది వరద చేరగా.. ఏపీ, తెలంగాణ, చత్తీస్గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే, విజయవాడలో ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీకి 11,459 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. 14 గేట్ల ద్వారా 10,150 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాలువల ద్వారా మరో 1,309 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు, ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టుకు వరద పెరుగుతోంది. స్పిల్ వే వద్ద నీటిమట్టం 31.7 మీటర్లకు చేరింది. శ్రీశైలం జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 817 అడుగులకు చేరింది.

# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఇప్పటికే ఫిబ్రవరిలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన మోడీ సర్కారు
- 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా కేంద్రం బడ్జెట్
- కొత్త పద్దులో అభివృద్ధి, సంక్షేమాల మధ్య ప్రభుత్వం సమతూకం పాటించే ఆస్కారం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కాలుష్య తీవ్రతను తగ్గించడమే లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీ?



న్యూఢిల్లీ ... నేటి నుంచి పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. బడ్జెట్ సమావేశాలకు సంబంధించి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ బడ్జెట్‌పై పూర్తి స్థాయి కసరత్తులు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. గతంతో పోలిస్తే భాజపాకి లోక్‌సభ స్థానాలు తగ్గడం, త్వరలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈసారి బడ్జెట్‌లో భారీగా జనాకర్షక నిర్ణయాలు ఉండవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య బీమా లబ్ధిదారులు, బీమా మొత్తం పెంపు, ఆదాయపు పన్ను విషయంలో ఉపశమనాలు సహా సామాజిక, సంక్షేమ వ్యయాలను పెంచే అవకాశాలున్నాయి. కొత్త పద్దులో అభివృద్ధి, సంక్షేమాల మధ్య ప్రభుత్వం సమతూకం పాటించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. కాబట్టి బడ్జెట్‌లో ఏ అంశాలను వెల్లడించబోతున్నారనే విషయాలను తెలుసుకోవడానికి సర్వత్రా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. బడ్జెట్‌లో ఉద్యోగాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. వీటిపై కొన్ని ప్రత్యేక ప్రకటనలు చేయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని బడ్జెట్లో ప్రతిపాదించే అవకాశం ఉంది. ముడి పదార్థాలపై సుంకాలను తగ్గించడం వంటివి కూడా ఉండవచ్చు. ప్రస్తుత బేసిక్ మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షలు పెంచడం సహా మధ్యతరగతికి మరింత ఉపశమనం కలిగించేలా వ్యక్తిగత ఆదాయపు పన్నులో సంస్కరణలు ఉండే అవకాశం ఉంది. లిస్టెడ్ ఈక్విటీ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల ట్యాక్స్ కనీస హోల్డింగ్ వ్యవధిని ప్రస్తుత ఏడాది నుంచి 2 లేదా 3 సంవత్సరాలకు పొడిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. స్టాక్ మార్కెట్లో దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ ప్రకటన చేయొచ్చని చెబుతున్నారు. ప్రధానంగా పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాలు మరియు ఇతర హరిత సాంకేతికతలలో పెట్టుబడి పెట్టే కంపెనీలకు తగ్గింపులు లేదా ట్యాక్స్ బెనిఫిట్ కల్పించని అవకాశం ఉంది. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులలో గణనీయమైన పెట్టుబడులకు అవకాశం ఉంది. భారతదేశంలో కాలుష్య తీవ్రతను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**ఆదాయపు పన్ను స్లాబ్‌లో రాయితీ**

కేంద్ర ప్రభుత్వ ఈ ఏడాది బడ్జెట్‌లో పన్ను శ్లాబ్స్‌లో మినహాయింపును కోరుతున్నారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలని కోరుతున్నారు. కొత్త పన్ను విధానంలో వర్తించని కొన్ని మినహాయింపులను కూడా అందించాలని పేర్కొంటున్నారు.

**సెక్షన్ 80సీ పరిమితి పెంపు**

ప్రస్తుతం రూ. 1.5 లక్షలుగా ఉన్న సెక్షన్ 80సీ మినహాయింపు పరిమితిని పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. దశాబ్ద కాలంగా ఈ పరిమితిని పెంచలేదని పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా ఈ పరిమితిని రూ. 2.5 లక్షలకు పెంచాలని అంటున్నారు. హౌమ్ లోన్ ప్రిన్సిపల్ రీపేమెంట్ల కోసం ప్రత్యేక తగ్గింపును గృహ కొనుగోలుదారులు ఎక్కువగా కోరుతున్నారు. ప్రస్తుతం సెక్షన్ 80సీ జీవిత బీమా ప్రీమియంలు, ట్యూషన్ ఫీజులు, ప్రావిడెంట్ ఫండ్ కంట్రిబ్యూషన్లు, హౌమ్ లోన్ ప్రిన్సిపల్ రీపేమెంట్లతో సహా వివిధ ఖర్చుల కోసం రూ. 1.5 లక్షల వరకు తగ్గింపును అనుమతిస్తుంది. పరిమితిని పెంచడం ద్వారా గృహ కొనుగోలుదారులకు కూడా మేలు జరగనుంది.

**ఏపీకి నిధులు**

అయితే ఈ ఆర్థిక సంవత్సర కేటాయింపుల్లో భాగంగా ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్రానికి భారీగా కేటాయింపులు కోరినట్లు తెలుస్తోంది. దాదాపు లక్ష కోట్లు మేరు చంద్రబాబు కేంద్రాన్ని కోరగా.. దానికి మోదీతో పాటుగా వివిధ మంత్రులు కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని చంద్రబాబు కోరినట్లు సమాచారం. ఆర్థిక లోటును భర్తీ చేయడానికి రూ.7000 కోట్లు, నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.50000 కోట్లు కేటాయించాలని మోదీతో పాటుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా చంద్రబాబు కోరినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.12 వేల కోట్లు, అప్పులను తీర్చేందుకు వచ్చే ఐదేళ్లలో రూ.15000 కోట్లు, యాభై సంవత్సరాల రుణ పథకం కింద మౌలిక వసతుల అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాల చంద్రబాబు కేంద్రాన్ని కోరినట్లు తెలుస్తోంది.

# మా ఊరికి బస్సొచ్చింది

- ఒక్క మెయిల్‌తో స్పందించిన మంత్రి నారా లోకేశ్
- హర్షం వ్యక్తం చేస్తున్న మార్లమడి గ్రామ ప్రజలు



కర్నూలు, మేజర్ న్యూస్ : మీ సమస్యలేవైనా నాకు ఒక్క మెయిల్ చేయండి. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటాను.' ఇదీ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పిన మాట. అలా చెప్పినట్లుగానే తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను ఆయన పరిష్కరిస్తున్నారు. తాజాగా, తమ ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలన్న విద్యార్థుల అభ్యర్థనపై చొరవ తీసుకున్న ఆయన వెంటనే సమస్యను పరిష్కరించారు. కర్నూలు జిల్లా హొలగుంద మండలం మార్లమడి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ లేదు. దీంతో తమ గ్రామానికి బస్సు సర్వీస్ నడపాలని మంత్రి లోకేశ్‌కు విద్యార్థి సంఘాలు మెయిల్ చేశాయి. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్.. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే మార్లమడికి కొత్త బస్సు సర్వీసును ఆదోని ఆర్టీసీ డిపో అధికారులు ప్రారంభించారు. దీంతో మంత్రి లోకేశ్‌కు గ్రామస్థులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మంత్రి లోకేశ్ ఇటీవలే తన వాట్సాప్‌కు వచ్చిన ఒక్క మెసేజ్‌తో 25 మంది దివ్యాంగ విద్యార్థుల సర్టిఫికెట్ల సమస్యలు పరిష్కరించి వారికి ఎన్ఐటీ, ఐఐటీ వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించారు.

***'మెయిల్ చేయండి చాలు'***

అయితే, రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి లోకేశ్ వాట్సాప్‌కు మెసేజ్‌లు పోటెత్తడంతో ఆయన వాట్సాప్ బ్లాక్ అయ్యింది. దీంతో ఆయన తనకు సమస్యలు మెయిల్ చేయాలని ప్రజలకు సూచించారు. దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో వచ్చి తనను కలవాల్సిన అవసరం లేదని.. సమస్యలను పూర్తి వివరాలతో ... మెయిల్ ఐడీకి పంపించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య – సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలు వినతిలో పొందుపరచాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే ఆయన ప్రజల సమస్యలును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వాటిని పరిష్కరిస్తున్నారు.

***సోషల్ మీడియాలో సైతం***

కేవలం మెయిల్స్‌కు మాత్రమే పరిమితం కాకుండా సోషల్ మీడియాలోనూ లోకేశ్ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇటీవలే అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతపర్తికి చెందిన శివ () ఏజెంట్ సాయంతో కువైట్ వెళ్లాడు. అక్కడ ఎడారిలో జన సంచారం లేని ప్రాంతంలో కోళ్లు, గొర్రెలు, పావురాలు, బాతులు మేపే పనిలో ఆయన్ను పెట్టగా.. తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. చావే శరణ్యమంటూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. దీనిపై స్పందించిన మంత్రి కువైట్‌లో భారత ఎంబసీ సాయంతో బాధితున్ని స్వగ్రామానికి తరలించేలా చర్యలు చేపట్టారు. అలాగే, అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన సరెల్ల వీరేంద్రకుమార్ ఏజెంట్ చేతిలో మోసపోయి సౌదీలోని ఎడారిలో చిక్కుకున్నాడు. తనను కాపాడాలని వీడియో తీసి ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. దీనిపై స్పందించిన లోకేశ్.. బాధితున్ని స్వగ్రామానికి చేర్చేలా చర్యలు చేపడతామన్నారు.

# విశాఖలో వైసీపీకి భారీ షాక్, టీడీపీలో చేరిన కార్పొరేటర్లు



- ఫలించని మాజీ మంత్రి గుడివాడ ప్రయత్నాలు
- పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా
- పాల్గొన్న ఎమ్మెల్యేలు గంటా, వంశీకృష్ణ, ఎంపీ భరత్


విశాఖపట్నం : విశాఖలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. విశాఖ మహా నగర పాలక సంస్థలో వైసీపీ పట్టు కోల్పోతోంది. జీవీఎంసీకి చెందిన 14 మంది కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీ మారవద్దని మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దాంతో వైసీపీ కార్పొరేటర్లు 14 మంది టీడీపీలో చేరిపోయారు. జీవీఎంసీ పరిధిలో విశాఖ ఈస్ట్, నార్త్, సౌత్, భీమిలి, గాజువాక ప్రాంతాలకు చెందిన వైసీపీ కార్పొరేటర్లు ఆదివారం నాడు అధికార పార్టీ టీడీపీలో చేరారు. విశాఖ టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లకు టీడీపీ కండువా కప్పి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికల కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ, పార్టీ నేతలు పాల్గొన్నారు. ఇటీవల అమర్ నాథ్ నిర్వహించిన సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న సమయంలో తమను ఎవ్వరు పట్టించుకోలేదని వైసీపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మాజీ మంత్రి చేతులెత్తేయాల్సిన పరిస్థితి నెలకొంది. విశాఖ జీవీఎంసీ పరిధిలో 98 డివిజన్ లు వుండగా 58 వైసీపీ, 30 టీడీపీ, 10 మంది జనసేన, బిజెపి ఇతర పార్టీలు వారు గెలిచారు. తాజా చేరికలు గమనిస్తే.. సగానికి సగం వైసిపి నుంచి టీడీపీ, జనసేనలో చేరే అవకాశం ఉందని స్థానిక నేతలు చెబుతున్నారు.



మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో శ్రీ రామదూత స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూర్ణిమ ఉత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేణు దత్తాత్రేయ స్వామి వారి అభిషేకం, పాదుకపూజా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీపై చంద్రబాబు ఫోకస్

- పనులు ఉన్నా పక్కనబెట్టి ఒకటో తేదీ జరిగే పింఛన్ల పంపిణీకి వెళ్లండి
- ఎమ్మెల్యేలు, మంత్రులు విధిగా పాల్గొనాలని ఆదేశాలు
- పాలనపై పూర్తిస్థాయి పట్టుకు ఏపీ సీఎం వరుస నిర్ణయాలు
- ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను కూడా భాగం చేయాలి
- జిల్లా టీడీపీ కార్యాలయాలలో ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించాలి



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనపై ఫోకస్ పెట్టారు. వచ్చే ఐదేళ్లు మాత్రమే కాకుండా మరికొన్నేళ్ల పాటు ఏపీలో టీడీపీ ప్రభుత్వం కొనసాగేలా చంద్రబాబు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగా ప్రజలకు, నాయకులకు మధ్య బలమైన సంబంధాలు ఉండేలా చంద్రబాబు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే ప్రభుత్వంపైనా కాకుండా పార్టీపైనా చంద్రబాబు దృష్టిపెడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రతి శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శిస్తున్న చంద్రబాబు.. ముఖ్యనేతలతో సమావేశమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపైనా వారితో చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం చంద్రబాబు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం పార్టీ నేతలతో సమావేశమైన చంద్రబాబు పింఛన్ల పంపిణీపై టీడీపీ నేతలకు కీలక సూచనలు చేశారు. ఏపీలో ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయగా.. టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇంటివద్దనే పింఛన్లు పంపిణి చేసింది. జులైలో తొలిసారిగా పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. ఒక్కరోజులోనే లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని టార్గెట్ పెట్టుకుంది. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం తొలి రోజే 94 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెల పింఛన్ల పంపిణీపై చంద్రబాబు దృష్టి సారించారు. అయితే ఆగస్ట్ నెల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, స్థానిక నేతలకు కూడా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

మిగతా పనులు ఉన్నప్పటికీ ప్రతి నెలా ఒకటో తేదీన తమ నియోజకవర్గాల్లో జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమాల్లో విధిగా పాల్గొనాలని నేతలను చంద్రబాబు ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి సాకులు చెప్పొద్దని స్పష్టం చేశారు. పార్టీకి, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉండేలా ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యవహరించాలని చంద్రబాబు సూచించారు. అలాగే జిల్లాల్లో ఉన్న పార్టీ కార్యాలయాలను నెలలో ఒక్కసారైనా సందర్శించాలని.. కార్యకర్తల కష్టాలు తెలుసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు, విజ్ఞప్తులు స్వీకరించి.. వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని చంద్రబాబు సూచించారు.

# సస్యరక్షణ చర్యలు సూచించండి



ఏపీ బ్యూరో సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టే విధంగా వ్యవసాయ అధికారులు సూచించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆదివారం ఉదయం అల్పపీడన ప్రభావం, పంట నష్టం, ఎరువుల లభ్యత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ఆదేశించారు. పంట పొలాల్లో నీటి నిల్వ తొలగింపు, తేమ ద్వారా ఆశించే తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో పంట కాలువలు, డ్రెయిన్లలో తక్షణమే పూడిక తీసి నీటి సరఫరా సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సీజన్ కు పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్ సీజన్ కోసం 17.50లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ప్రారంభ నిల్వలతో కలిపి 14లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన ఎరువులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,321సహకార సంఘాల్లో రైతులకు విక్రయించేందుకు ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

## అమెరికా రోడ్డు ప్రమాదంలో
# తెనాలి వెటర్నరీ వైద్యురాలు మృతి



తెనాలి, మేజర్ న్యూస్ : అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఓ వెటర్నరీ వైద్యురాలు ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జెట్టి హారిక అమెరికాలోని ఓక్లహోమా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహం కోసం భారత రాయబార కార్యాలయం వద్ద ఎదురుచూపులు చూస్తున్నారు. తెనాలికి చెందిన జెట్టి హారిక ఏడాదిన్నర క్రితం వెటర్నరీలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. ఆమె తల్లిదండ్రులు జెట్టి శ్రీనివాసరావు, నాగమణి. తండ్రి దేవాదాయ శాఖ ఉద్యోగిగా పని చేస్తున్నారు. హారిక మృతితో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

# అన్నా లెజినోవాపై బాబు ప్రశంసలు

అమరావతి... ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవాకు సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. అన్నా లెజినోవా మాస్టర్స్ డిగ్రీ పొందిన నేపథ్యంలో.. ఆమెకు అభినందనలు తెలియజేస్తూ చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. మరోవైపు సింగపూర్ యూనివర్సిటీ నుంచి అన్నా లెజినోవా డిగ్రీ పట్టా పొందారు. ఈ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ సైతం హాజరుకాగా.. ఈ వీడియోలు, ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా మాస్టర్స్ డిగ్రీ పొందిన సంగతి అందరికీ తెలిసిందే. సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ నుంచి అన్నా లెజినోవా మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమానికి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ క్రమంలోనే పలువురు ప్రముఖులు అన్నా లెజినోవాకు అభినందనలు కూడా తెలిపారు. తాజాగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా పవన్ సతీమణి అన్నా లెజినోవాకు అభినందనలు తెలిపారు.

# తుడా ఛైర్మన్‌గా చైతన్య?



తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ– తుడా ఛైర్మన్ గా జనసేనా పార్టీ నాయకురాలు చైతన్య పేరు దాదావు ఖరారైంది. జనసేన పార్టీ చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా, పార్టీ బలోపేతంతో పాటు కూటమి అభ్యర్థుల గెలుపునకు విశేషంగా కృషి చేసినందుకు గానూ జనసేనా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశీర్వాదంతో చైతన్య పేరు దాదావు ఖరారైనట్లు సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తుడా ఛైర్మన్ పదవి కోసం పలువురు టీడీపీ నాయకులు పోటీలో ఉన్నారు. కానీ చిత్తూరు జిల్లాలోని సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని స్వయానా ఆదికేశవులు నాయుడు మనవరాలైన చైతన్య వైపు జనసేన పార్టీతో పాటు కూటమి అగ్రనాయకులు మొగ్గుచూపుతున్నారు. చైతన్య అభ్యర్థిత్వాన్ని జనసేనా, టీడీపీ, బీజేపీ పూర్తిగా బలపరుస్తున్న కారణంగా రెండు, మూడు రోజుల్లో శ్రీమతి చైతన్య పేరును తుడా ఛైర్మన్‌గా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు శాసనసభకు, చిత్తూరు పార్లమెంట్ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశాలున్న అధినాయకత్వం ఎంపికల్ని కాదనకుండా ఆయా చోట్ల నిలిపిన కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి నాయకులు చైతన్య అభ్యర్థిత్వానికి మద్దతు పలుకుతున్నారు. పైగా ఈమె అదికేశవుల నాయుడు కుటుంబం నుంచి వచ్చిన యువ నాయకురాలు కావడంతో ఈ పదవిని చైతన్యకు ఇవ్వడం ద్వారా వారి కుటుంబానికి సరైన గౌరవం కల్పించినట్లవుతుందని, ఆ ప్రాంతంలోని సామాజిక సమీకరణాల్ని సైతం తృప్తి పరిచినట్లవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

## పేద ప్రజల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాలవీరాంజనేయస్వామి

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతి నిధి: పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ద్వేయమని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా పేద ప్రజలకు రైతుబజార్లలో రాయితీపై నిత్యవసర సరుకులు అందిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదివారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామని మంత్రి అన్నారు. ఏ-గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల నాణ్యమైన సోనా మసూరి బియ్యాన్ని కిలో రూ. 48 , రూ.49 కే ప్రజలకు అందిస్తున్నారు. ఒంగోలు లోని 3 రైతు బజార్లతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 వరకు అందుబాటులో ఉంటాయని జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

## 23 నుండి ఇంజనీరింగ్ ప్రవేశాల తుది విడత ప్రక్రియ

● నోటిఫికేషన్ విడుదల చేసిన కన్వీనర్ డాక్టర్ నవ్య

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్దేశించిన ఏపి ఈఏపిసెట్ 2024 తుదిదశ అడ్మిషన్ల ప్రక్రియ జులై 23 ప్రారంభం అవుతుం దని సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు, ప్రవేశాల కన్వీనర్ డాక్టర్ బి నవ్య తెలిపారు. ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియను విద్యార్థులు జులై 23 నుండి జులై 25 లోపు పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. జులై 23 నుండి 26 వ తేదీ వరకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఉంటుందని, జులై 24 నుండి 26 వరకు 3 రోజుల పాటు ఆప్షన్ల ఎంపిక పూర్తి చేసుకోవాలని కన్వీనర్ స్పష్టం చేసారు. ఐచ్ఛికాల మార్పుకు 27వ తేదీ నిర్దేశించామన్నారు.
30వతేదీన సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని తెలిపారు. సెల్ఫ్ జాయినింగ్, కళాశాలలో రిపోర్టింగ్ కోసం జులై 31 నుండి ఆగస్టు 3 వరకు నాలుగు పాటు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే జులై 19వ తేదీ నుండి తరగతులు ప్రారంభం అయ్యాయని డాక్టర్ నవ్య వివరించారు.

# నోటికి వచ్చినట్లు మాట్లాడొద్దు జగన్



● జగన్‌కు ఏపీ హోమ్ మినిస్టర్ హెచ్చరిక ● అన్ని అబద్ధపు లెక్కలు ● టీడీపీ అధికారంలోకి వచ్చాక కేవలం 4 హత్యలే జరిగాయి ● ఇందులో 3 టీడీపీ కార్యకర్తలు, నాయకులేనన్నారు

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నోటికి వచ్చినట్లు మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. సరైన వివరాలు, ఆధారాలు లేకుండా టీడీపీ ప్రభుత్వాన్ని అల్లరి చేసేందుకు, ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసేందుకు జగన్ ప్రయత్నిస్తే..అందుకు తగిన విధంగా మూల్యం చెల్లించాల్సి వస్తుందని వెల్లడించారు. ఆదివారమిక్కడ మీడియాతో అనిత మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ జగన్ చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని లేకుంటే చర్యలకు సిద్ధంగా ఉండాలంటూ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరిగాయని చెప్తున్న రాజకీయ హత్యల వివరాలు ఇవ్వాలని జగన్ కు సూచించారు. రాష్ట్రంలో కేవలం నాలుగు రాజకీయ హత్యలు మాత్రమే జరిగాయని, వీటిలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలే చనిపోయారని హోంమంత్రి వెల్లడించారు. కానీ జగన్ మాత్రం 36 రాజకీయ హత్యలు జరిగాయని ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని విమర్శించారు. అదే నిజమైతే జగన్ తమ ప్రభుత్వానికి హత్యల వివరాలు ఇవ్వాలన్నారు. ఈ వివరాలు ఇవ్వలేకపోతే ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోకూడదని వంగలపూడి అనిత ప్రశ్నించారు. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని వివరించారు. టీడీపీ, జనసేన నేతల్ని సీఐడీ ఆఫీసులకు రప్పించి కేసులు పెట్టారని హోంమంత్రి ఆరోపించారు. ఇప్పుడు బాధిత కుటుంబం పరామర్శకు వెళ్లి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. గతంలో జగన్ ప్రభుత్వంలో రాజ్యాంగ ఉల్లంఘనలపై హైకోర్టు చీవాట్లు పెట్టిందని గుర్తుచేశారు. జగన్ నంగనాసి కబుర్లు మాట్లాడితుంటే, విడ్డూరంగా ఉందని, ఆయన సీఎం అయ్యాక రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని వివరించారు. దీనికితోడుగా జగన్ మోహన్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వినుకొండలో వర్గ విభేదాలు కారణంగా హత్య జరిగితే, దానికి రాజకీయ రంగు పులుమేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఆయన వద్ద 36 రాజకీయ హత్యకు డేటా ఉందా అని ప్రశ్నించారు. ఆయన చెప్పేవన్నీ అబద్ధపు లెక్కలని వివరించారు. అధికారం పోయి రెండు నెలలు కాకమునుపే అధికారం కోసం ఆరాటం పడుతున్నారన్నారు. చంపుకోవడం అనేది తప్పుని, హత్యా రాజకీయాలను నిలువరించే దిశగా టీడీపీ పాలన చేస్తుందన్నారు.

### నాటకీయ పరిణామాల నేపథ్యంలో

# అసెంబ్లీ సమావేశాలు



● రెండో సమావేశాలపైనే ప్రజల ఆసక్తి ● సభలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లు ప్రవేశం ● వైసీపీ ప్రతిపక్ష హెూదాపై తర్జన భర్జన ● సాధారణ సభ్యునిగా సభకు జగన్ ● సీట్ల కేటాయింపు లేకుండానే సభలు ● ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్రంలో రోజుకో విధంగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండోసారి ఈ సమావేశాలు జరగనున్నాయి. తొలిసారి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన శాసన సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమావేశంలో మూడు పార్టీల శాసన సభ్యుల మధ్య ఎటువంటి వాడీవేడి వాదనలు చోటుచేసుకోలేదు. అన్నీ సవ్యంగా జరిగితే ఈ సమావేశంలో ఓటాన్ లేదా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంటుంది. అయితే ఈ రెండు నెలల వ్యవధిలో వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం నాలుగు హత్యలు జరిగాయి. ఇందులో వినుకొండలో జరిగిన హత్య రాజకీయంగా చర్చనీయాంశం అయింది. హతుడు వైసీపీకి చెందిన వారేనని, ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన వివాదం చిలికి చిలికి గాలివానలా తయారై హత్యకు దారి తీసిందని టీడీపీ చెబుతోంది. అయితే అది రాజకీయ హత్యేనని, హతుడు తమ పార్టీ కార్యకర్తని వైసీపి చెబుతోంది. దీనిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు, ప్రజల్లోకి వచ్చేందుకు వైసీపి ఒక ఆయుధంగా వాడుకుంటోంది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ వినుకొండ వెళ్లి హతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పనిలోపనిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ కార్యకర్తలపై ధాడులు, హత్యలు జరిగాయంటూ ఆరోపణలు చేశారు. ఈ సంఘటనలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో తమ పార్టీ సభ్యుల ద్వారా రాష్ట్రంలోని పరిస్థితులను వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలను కలువుకుని ఈ కార్యక్రమం బుధవారం జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం జడివానలో గవర్నర్ ని కలిశారు. ఇక్కడి పరిస్థితులను ఆయనకు వివరించారు. సోమవారం నాటి అసెంబ్లీ సమావేశంలోనూ ఈ హత్యా రాజకీయాల అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చే ప్రయత్నంలో ఆ పార్టీ అధినేత జగన్ ఉన్నారు.

కాగా, సోమవారం నుంచి ఐదు రోజులపాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. పరిమిత సమయం ఉండటం కారణంగా అసెంబ్లీలో సభ్యులకు సీట్లు కూడా కేటాయించలేదు. ముందు వచ్చిన శాసన సభ్యులు తనకు నచ్చిన సీటులో ఆశీనులయ్యే సౌలభ్యం ఇక్కడ లభించనుంది. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని గతంలోనే జగన్ లేఖ రాశారు. దానిపై కూటమి సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయినా, విధానపరంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సోమవారం ఉదయం 8.30 గంటలకు వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నేతల నివాళులు అర్పిస్తారు. అనంతరం అసెంబ్లీకి సభ్యులు హాజరుకానున్నారు. టీడీపీ శాసనసభ్యులంతా పసువు రంగు దుస్తులు, సైకిల్ గుర్తు కండువాలతో రావాలని టీడీఎల్పీ ఆదేశించింది. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బీఏసీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలోనే సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. ఐదు రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్టు అధికార పార్టీ సభ్యులు చెబుతున్నారు. ఈ నెలాఖరుతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ముగియనున్న నేపథ్యంలో మరో మూడు నెలలకు ఓట్ అన్ అకౌంట్ బడ్జెట్ను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. అక్టోబర్ లో పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రభుత్వం ప్రవేశ పెట్టే అవకాశాలు ఉన్నాయి.

**అన్నీ సవ్యంగా జరిగితే 23న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లును సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టే యోచనలో ఉంది**

వైసీపీ పాలనపై ఇప్పటికే నాలుగు శ్వేతపత్రాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు, మరో మూడు శ్వేతపత్రాలను సభలో విడుదల చేసి చర్చ పెట్టనున్నారు. శాంతిభద్రతలు, మద్యం, ఆర్థికశాఖలకు సంబంధించిన అంశాలపై శ్వేత పత్రాలను విడుదల చేసి సభలో చర్చకు తీసుకురానున్నారు. **పాసుల కుదింపు :** సమావేశాలకు సందర్శకుల పాసులు కుదిస్తూ ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. ఎమ్మెల్యేల వెంట ఎక్కువమంది అనుచరుల రాకను నిలువరించే యత్నంలో పాసుల సంఖ్య కుదింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చేందుకు నేతలు, కార్యకర్తలు అసెంబ్లీకి వస్తుండటంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని పరిగణలోకి తీసుకుని అసెంబ్లీ ముగిశాక సందర్శకులను కలవాలని మంత్రులకు సీఎం సూచనలు చేశారు. సభ్యుల ప్రశ్నలకు జవాబులు చెప్పేలా సిద్ధం కావాలన్న సీఎం చంద్రబాబు ఆదేశించారు. ముందుగానే తమ శాఖలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని, సమాధానాలు చెప్పే సమయంలో కొంత సంయనం, ఆలోచనతో వ్యవరించాలని సూచించారు.



## దాడులపై సాక్ష్యాలను గవర్నర్‌కు అందించిన జగన్

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ను వైసీపీ అధినేత జగన్ ఆదివారం కలిశారు. రాజ్యభవన్ కు వెళ్లి గవర్నర్ తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి జరిగిన దాడులపై గవర్నర్ కు వివరించారు. వినుకొండలో రషీద్ హత్య, వుంగనూరులో ఎంపీ మిధున్ రెడ్డిపై రాళ్లదాడి, మాజీ ఎంపీ రెడ్డప్ప కారు దహనం సహా రాష్ట్రంలో జరిగిన దాడులపై సాక్ష్యాలు, వీడియోలను గవర్నర్‌కు అందించారు.

### నరసాపురం ఎంపీడీవో కుటుంబాన్ని

## పరామర్శించిన జిల్లా ఎస్పీ

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: గత కొద్ది రోజులుగా అదృశ్యమైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండల వెంకట రమణారావు కుటుంబాన్ని ఆదివానం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ఐపీఎస్ పరామర్శించారు. పెనమలూరు మండలం కానూరులో నివాసం ఉంటున్న ఎంపీడీవో నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని, ఎంపీడీవో కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన అదృశ్యానికీ కల కారణాలు, ఇంకా ఏదైనా సమస్యలు ఉన్నవేమో అని అడిగి తెలుసుకున్నారు. ఆయన కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని, దిగులు పడవద్దని వారికి ధైర్యాన్ని చెప్పారు.

# స్వీయ రక్షణలో హోమ్ మినిస్టర్, డీజీపీ

● వీరి నియామకంలో సీఎం సముచిత నిర్ణయం ● కార్యాచరణకు సిద్ధమయ్యేలోపే సంఘటనలు ● నిఘా వైఫల్యం లోపించిన సమయస్ఫూర్తి ● వైసీపీకి ఊపిరిలూదిన వినుకొండ సంఘటన ● రచ్చ చేసే వ్యూహరచనలో వైసీపీ

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: హోమ్ మినిస్టర్ అనిత, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ద్వారకా తిరుమల రావులు స్వీయ రక్షణలో పడిపోయారు. రాష్ట్రంలో వరుస హత్యలు జరుగుతున్న నేపథ్యంలో వీరి పనితీరుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏమిటీ అప్పుడే ఈ హత్యలు, దాడులు అనే చర్చ ప్రజల్లో ప్రారంభం అయింది. ఇద్దరూ సమర్ధులే కదా ... నిబద్ధతో పనిచేసే వారే కదా..శాంతి భద్రతలు ఎందుకు అదుపు తప్పుతున్నాయి అనే చర్చ జరుగుతోంది. వినుకొండలో జరిగిన హత్య వెనుక పూర్తి వివరాలు వెలుగులోకి రాకపోయినా, హతుడు తమ కార్యకర్త అని వైసీపీ చెప్పుకుంటోంది. దానికి ఆధారాలు చూపుతోంది. ఆ హత్యను ఆలంబనగా చేసుకుని ప్రజల్లోని వచ్చే ప్రయత్నం చేస్తోంది. రచ్చరచ్చ చేస్తోంది. ఢిల్లీలో ధర్నా, పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రస్తావించేందుకు సిద్ధం అయింది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి ఈ సంఘటనను దేశ వ్యాప్తంగా ప్రజలకు తెలియపరిచే బాధ్యతను పార్లమెంట్ సభ్యుల భుజస్కందాలపై పెట్టారు. పార్లమెంట్ సభ్యులు ఏ విధంగా వ్యవహరించాలి అనే అంశంపై సూచనలు ఇచ్చారు. రాష్ట్రపతి, ప్రధానిల అపాయింట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వారి అపాయింట్ తీసుకుని ఇక్కడి పరిస్థితులను వివరించే యత్నంలో ఉన్నారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ టీడీపీ వైఖరిని ఎండబెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. వైనాట్ 175 అంటూ ఎన్నికలకు సిద్ధమైన ఆ పార్టీ ఫలితాలు వచ్చేటప్పటికి చతికిలపడిపోయింది. కేవలం 11 సీట్లనే ధక్కించుకుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవహార శైలిని దగ్గరుండి చూసిన వ్యక్తులు ఆయన ఇంకా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. శాసన సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో జగన్ తన పేరును ఉచ్చరించడంలోనూ తడబడ్డారు. సభలో ఉన్నంత సేపు ముళ్లమీద కూర్చున్నట్టుగా కనిపించారు. వైసీపీ శాసన సభ్యులు, మాజీలు పార్టీలో ఉంటారా? అసలు పార్టీ ఉంటుందా? జగన్ తాడేపల్లి వదిలేసి బెంగుళూరు వెళ్లిపోతారా అని కూడా రాజకీయ వర్గాల్లో వినపడింది.



అయితే ఒక్క వినుకొండ హత్య, రాష్ట్రంలోని టీడీపీ కార్యకర్తల దాడులు వైసీపీకి కొత్త ఊపిరిని ఇచ్చాయి. వ్యక్తిగత పనులపై బెంగుళూరు వెళ్లిన జగన్ హుటాహుటిన తాడేపల్లికి వచ్చేశారు. ఆందోళనా కార్యక్రమాలకు వ్యూహ రచన చేశారు. అన్ని రాజకీయపార్టీలను కలువుకుని ఆందోళనా కార్యక్రమాలు చేద్దామని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లోకి రావడానికి బయపడిన మాజీలకు ఇవి కొండంత ధైర్యాన్ని కలిగించాయి. మొన్నటి వరకు మీడియా ముందుకు రావడానికి వెనుకంజ వేసిన మాజీ శాసన సభ్యులు మీడియా సమావేశాలు పెడుతున్నారు. టీడీపీపై విమర్శల జోరును పెంచారు. ఈ పరిణామం కార్యకర్తల్లోనూ కొంత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనితకు ఆ పదవి ఇవ్వడంలోనూ, ద్వారకాతిరుమల రావును ఆ పోస్టులో నియమించడంలోనూ మంచి నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం వీరి నియామకాల సమయంలో వినిపించింది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాలో అనిత క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీ పిలువునిచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమయంలో అనేక బాధలు, వేధింపులకు గురయ్యారు. వైసీపీ సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత విమర్శలకు గురయ్యారు. వైసీపీ నాయకుల చర్యలపై ఫిర్యాదు చేయడానికి కూడా పోలీస్ యంత్రాంగం అమెకు అవకాశం ఇవ్వలేదు. డీజీపీని కలవడానికి, ఫిర్యాదు ఇవ్వడానికి ప్రయత్నిస్తే, డీజీపీ కార్యాలయంలోకి వెళ్లే అవకాశం లేకుండా ప్రభుత్వం చేసింది. అన్నింటి ఓర్పుగా భరించారు. ఏ సమయంలోనూ వెనుకంజ చేయలేదు. పోరాట పటిమ చూపారు.

వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అనితకు హోమ్ మంత్రి పదవి ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత అనిత శాంతి భద్రతలను కాపాడే విషయంలోనూ, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. చిన్నపిల్లలు, మహిళలపై అత్యాచారం చేసే వారికి అంతిమ రోజులు వచ్చినట్టుగానే భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీస్ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అయితే .. ఏమో ఎక్కడో పొరపాటు జరిగింది. ఆమె కార్యాచరణకు ఉపక్రమించేలోపే ఈ ఘటనలు జరిగిపోయాయా? లేక ఆమె అంచనాలకు, ఊహలకు భిన్నంగా పరిస్థితులు చోటుచేసుకున్నాయా అనేది అర్థం కావడం లేదు. అయితే ఒకటి మాత్రం నిజం. హోమ్ మంత్రి పదవి ఆషామాషి పదవికాదు. లిప్తకాలం ఆదమరిస్తే...ఎన్ని సంఘటనలైనా జరిగిపోయే ప్రమాదం ఉంది. పోలీస్ అధికారులే కాదు....మంత్రి కూడా కంటిమీద కునుకు లేకుండా రాష్ట్రం మొత్తాన్ని పరికించి చూడాల్సి ఉంది. నిఘా వర్గాలతో ప్రతీ నిత్యం టచ్ లో ఉండాలి. రాష్ట్రంలోని ఏ మారుమూల ప్రాంతంల్ ఏ సంఘటన జరిగినా,దాని పూర్వోత్తరాలు తెలుసుకోవాలి. భవిష్యత్ లో ఆ సంఘటన ఏ ఉద్యమానికి ఊపిరి పోయనుందో ముందుగానే ఊహించగలగాలి. మొక్కలోనే దానిని తుంచేయాలి. భవిష్యత్ లో మరిన్ని ఆందోళనలు, ప్రజా ఉద్యమాలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే ఎన్నికలకు ముందు టీడీపీ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో వాటి



అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కత్తిమీద సాము చేయక తప్పదు. కొన్ని హామీల అమలులో జాప్యం జరిగే అవకాశాలు రావచ్చు. కొన్నింటిని అమలు చేసే విషయంలో షరతులు విధించవచ్చు. వీటినే వైసీపీ ఆలంబనగా చేసుకుని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తుంది. అప్పుడూ ఇప్పటిలానే ఉంటే హోమ్ మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు జవాబు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక డీజీపీ ద్వారకాతిరుమలరావు విషయానికి వస్తే...సమర్ధుడు. నిబద్ధత కలిగిన అధికారి అని పేరుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతకాలం లూప్ లైన్ లోనే ఉన్నారు. తన స్థాయికి తగిన పోస్టు రావడం లేదని, తన సహచరులు, జూనియర్లు ఫోకల్ పోస్టుల్లో బిజీగా ఉండటంతో ద్వారకాతిరుమలరావు ఆవేదనకు గురయ్యారు. కేంద్రానికి వెళ్లిపోడానికి ధరఖాస్తు చేసుకున్నారు.

ఆ సమయంలో ఆర్టీసీ ఎండీగా పోస్టింగ్ వచ్చింది. వైసీపీ ప్రభుత్వహయాంలోనే ఈ పదవి వచ్చినా, బాధ్యతల నిర్వహణ విషయంలో అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యత ఇచ్చారు. టీడీపీ వినతులను చాలా వరకు పరిష్కరించారు. కొన్నింటికి ప్రభుత్వం ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, ఆ ప్రభుత్వానికి నచ్చచెప్పుకున్నారు. న్యాయమైన టీడీపీ వినతులను పరిష్కరించారు. ఇంకా 15 నెలలోపే సర్వీసు ఉంది. డీజీపీ పోస్టుకు అన్ని అర్హతలున్నా, కొత్త ప్రభుత్వం వద్ద గుర్తింపు కోసం ప్రాకులాడలేదు. డీజీపీ పోస్టు విషయమై సన్నిహితులు ఆయన వద్ద ప్రస్తావించిన సమయంలో తన అభిప్రాయాన్ని ఎప్పుడు వ్యక్తం చేయలేదు. మిగిలిన సర్వీసులో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహించే పోస్టు వచ్చినా బాధ లేదనే ఉద్దేశంలో ఆయనున్నట్టు సన్నిహితుల కధనం. అయితే చంద్రబాబు ద్వారకాతిరుమలరావు సమర్థత, నిబద్ధతను గుర్తించి డీజీపీ పోస్టులో నియమించారు. నెలా పదిహేను రోజుల వ్యవధిలోనే కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇది నిఘా వర్గాల వైఫల్యమా? నియంత్రణలో పోలీసుల వైఫల్యమా అనేది తేలాల్సి ఉంది. పోలీస్ శాఖకు సమర్థత, నిబద్ధతకు మించి మరో లక్షణం సమయస్ఫూర్తి. ఇది లోపించడం వల్లనే హోమ్ మంత్రి, డీజీపీలు స్వీయరక్షణలో పడిపోయారని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

## యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ
● పెద్దవాగు, గోదావరి వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ నేతృత్వంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, డేగ ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎం కృష్ణ చైతన్య తదితరులతో కూడిన సిపిఐ ప్రతినిధి బృందం పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు కుక్కునూరు మండలాల్లోని పెద్దవాగు ముంపు ప్రాంతాలలో పర్యటించింది.అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. కుంభవృష్టి కారణంగా చాలాచోట్ల గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలవరం ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు కుక్కునూరు మండలాల్లో పెద్ద వాగు ప్రాజెక్టు తెగిపోవటం వల్ల చాలా నష్టం జరిగి వేలాది కుటుంబాలవారు నిరాశ్రయులయ్యారని తెలిపారు. వేలాది ఎకరాల్లో ఇసుక మేటలేసి పంట నష్టం జరిగిందని, ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఈ పరిస్థితులపై వెంటనే స్పందించాలాన్నారు. నిన్న ఏపీ మంత్రి పార్థసారథి, ఈరోజు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రాంతాల్లో పర్యటించారన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యమే పెద్దబాబు గంటకి కారణమని తెలిపారు. ఎడతెగని వర్షాల వల్ల, తుఫాను వల్ల ప్రజలు చాలా ఇబ్బందుల్లో, నష్టాల్లో, కష్టాల్లో ఉన్నారని. తక్షణమే ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన ప్రజల్ని ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులకు సక్రమంగా నిధులు కేటాయించకపోవడం వల్ల మరమ్మతులకు నోచుకోక అస్తవ్యస్తంగా మారాయని, గతంలో జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లాలోని అన్నమయ్య, పింఛ ప్రాజెక్టులు కొట్టుకు పోయినా పట్టించుకోలేదన్నారు. పెద్ద వాగు ప్రాజెక్టుకు కూడా నిధులు ఇవ్వకపోవడం వల్ల ఇప్పుడు ఈ ప్రమాదం సంభవించిందని తెలుస్తోందన్నారు.

పెద్దవాగు ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతంలో ఉండగా, ఆయకట్టు ప్రాంతమంతా ఆంధ్ర ప్రాంతంలోనే ఉందని; గతంలో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పెద్దబాబుకు గండి పడటానికి ఆస్కారం అయ్యిందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు ఉండే ప్రాంతంలో అధిక వర్షాలు వరదల కారణంగా పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని; పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో గత పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జాతీయ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని విమర్శించారు. పోలవరం నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న వారు, గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేయాల్సిన పోలవరం నిర్వాసితులు వానలు వచ్చిన సందర్భంలో పదేపదే నష్టపోతున్నారన్నారు. పునరావాసం కోసం పరుగులు పెడుతున్నారని; దళితులు, గిరిజనులు ఎక్కువగా ఉన్న పోలవరం ముంపు ప్రాంతాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే స్పందించి బాధిత 15 గ్రామాల ప్రజలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పెద్ద వాగు ప్రాజెక్టు పునః నిర్మాణానికి తగు నిధులు కేటాయించాలని కోరుతామని, వరద బాధిత ప్రాంతాల పరిస్థితులను ముఖ్యమంత్రి, రెవిన్యూ మంత్రిల దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. అక్కినేని వనజ, డేగ ప్రభాకర్, కృష్ణ చైతన్యలు మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు తక్షణమే పూనుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి, ఇల్లు కోల్పోయి నిర్వాసితులైన బాధితులకు పరిహారం అందించాలన్నారు.

### అనుమానాస్పద వ్యక్తుల పట్ల

## అప్రమత్తంగా ఉండాలి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: సోమవారం నుండి జరుగ బోయే అసెంబ్లీ సమావేశాలను పరిగణనలోకి తీసుకుని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తూళ్లూరు సబ్ డివిజన్ పరిధిలోని వెలగపూడి సచివాలయం, అసెంబ్లీ సమావేశాలకు ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం మంత్రులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు సీనియర్ అధికారులు మరియు, వి.వి ఐపిలు వచ్చే అవకాశం ఉంది. ఈ సందర్భంగా సచివాలయం దగ్గర, అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమైన ప్రాంతాలు, హెలిప్యాడ్ ప్రాంతం అ చుట్టు పక్కల ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి బ్రీఫింగ్ చేశారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..అసెంబ్లీ సమావేశాలు దృష్టిలో ఉంచుకుని పోలీస్ అధికారులు మరియు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని తెలియజేశారు. అందరూ సమయపాలన పాటించాలని, ఎదైనా సంఘటన జరిగితే పై అధికారులకు వెంటనే సమాచారం అందించాలని అదేవిధంగా దారి వెంట బి.డి టీములు, ఏరియా డామినేషన్ పార్టీలు, డాగ్ స్క్వాడ్ బృందాలు, రోప్ పార్టీలు, ట్రోలింగ్ వెహికల్స్ వారికీ కేటాయించిన విధులను అయా ప్రదేశాలలో అందుబాటులో వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ శ్రీ సతీష్ కుమార్ తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కొలికలపూడి తీరే డిఫరెంట్

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు తీరేవేరు. ఆయన వ్యవహారశైలి మిగిలిన వారికంటే భిన్నంగా ఉంది. నియోకవర్గంలోని సమస్యల పరిష్కారానికి ఆయనే ప్రతిపక్ష సభ్యుని పాత్ర పోషిస్తున్నారు. నెల రోజుల క్రితం అందరి కంటే భిన్నంగా ఉండాలని హడావుడి చేశారు. ఈ విషయం సీఎం చంద్రబాబుకు చేరింది. సమస్య పరిష్కారానికి అధికార పార్టీ శాసన సభ్యుల తీరు వేరుగా ఉంటుందని, ప్రతిపక్ష సభ్యుని తీరు మరోలా ఉంటుందని నాయకుల ద్వారా చెప్పించారు. ఆయన పనితీరు మారిందని అంతా భావించారు. అయితే పదిహేను రోజులు తిరగక ముందే వినూత్నంగా వ్యవహరించారు. ఆదివారం అందరిని ఆకట్టుకున్నారు. తన నియోజకవర్గంలోని అధికారుల తీరును వ్యతిరేకిస్తూ.. వర్షంలో తడుస్తూ తన అభిప్రాయాన్నిచెప్పారు. శనివారం తిరువూరు పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో ఓ వార్డులో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఉంది. దీంతోరోడ్లు భవనాల శాఖ అధికారుల నుంచి వివరణ తీసుకునేందుకు వారి కోసం గంట పాటు వర్షంలో నిరీక్షించారు. వర్షంలో తడుస్తూనే అధికారుల తీరుపై నిరసన తెలిపారు. గుంతలను ఎందుకు పూడ్చలేదంటూ రోడ్లు భవనాల శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఎమ్మెల్యే రావటంతో స్థానికులు కూడా తమ సమస్యలను ఏకరువు పెట్టారు. రోడ్ల గుంతలు పూడ్చకపోవటం వలన, మరమ్మత్తులు చేయకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారులపై మండిపడిన కొలికపూడి శ్రీనివాసరావు.. రోడ్ల మరమ్మత్తులకు మంజూరైన నిధులు ఏమయ్యాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల మరమ్మతులు ఎప్పటిలోగా పూర్తిచేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అయితే ఎమ్మెల్యే వర్షంలో తడుస్తూ అధికారుల తీరుపై నిరసన తెలపడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోషల్ మీడియాలో వైరల్ కావటం ఇదే తొలిసారేమీ కాదు. ఇటీవలే సత్వర న్యాయం పేరుతో వైసీపీ ఎంపీపీ నాగలక్ష్మి ఇంటిని కూల్చివేసిన ఘటనలోనూ ఆయన చర్చనీయాంశమయ్యారు. దీనిపై పోలీసులు కొలికపూడి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు సైతం ఆయనను మందలించినట్లు వార్తలు వచ్చాయి. దూకుడైన చర్యలు వద్దంటూ, ఓర్పు, సహనంతో ఉండాలంటూ ఆయనకు సూచించినట్లు తెలిసింది. అయితే ఈ ఘటన జరిగి నెలరోజులు తిరగకుండానే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి వార్తల్లో నిలిచారు. మరోవైపు అమరావతి రైతు ఉద్యమ నేతగా కొలికపూడి శ్రీనివాసరావు ఫేమస్ అయ్యారు. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

అక్షరం

4

సోమవారం 22 జూలై 2024

editpage@suryaa.com

# మగువ మనోవేదన



లక్షలు కట్నంగా పోసి
నిర్బంధంలో నివసించే
విడుదల లేని ఖైదీని నేను
రెక్కలొచ్చినా విహరించలేని
పంజరంలో బందీ అయిన
స్వేచ్ఛ లేని పక్షిని నేను
అంతరంగంలో తన్నుకు
వస్తున్న దుఃఖాన్నోర్చుకుని
పెదవులపై కపట నవ్వు చిందించే
చిరునవ్వును నేను...
నెత్తుటి శ్రమ పెట్టుబడితో
కంచంలో కూడయ్యే మాంసపు
ముద్దని నేను....!

ఒంటిపై మాయని గాయాన్ని
ఎదలోని తరగని భాధని
కప్పిపుచ్చి ఉలుకు పలుకులేని
ప్రాణమున్న శిలని నేను....!
ఆశల సుడిగండంలో భావ
ప్రవాహంలో కొట్టుమిట్టాడే
ఈతరాని చేప పిల్లని నేను....
ఈ సృష్టిని సృష్టించి
ఈ మానవ మనుగడ కు
ఆధారమయ్యే మూలాన్ని నేను...!
ఈ సమాజం
దృష్టిలో చెప్పినట్టు ఆడే
నేనో కీలుబొమ్మని...
మనుషుల అవసరాలను
తీర్చే నేనో తోలుబొమ్మని...
శ్లోకాలలో సామెతలో కీర్తించబడుతూనే
శోక సంద్రంలో బతికే అనామికని
అర్థ కానీ మనుజుల మధ్యే సాగే ఒంటరి
జీవిని...!

**యం రాజశేఖర్**
**9381004519**


# త్యాగం వృదా అవ్వదు

ఆకులు పండి రాలుతున్నాయి
మోడుబారిన జీవితములో చిగురిద్దామని
ఆకులు త్యాగం చేసిన శిశిరానికి
ఆనందం పులుమ వస్తుంది వసంతం!
తాను ఆవిరై ఆకాశానికి
ఆర్ద్రత కలిగించిన సముద్రానికి
ముగ్ధ అయిన ఆకాశం మురిసి
హర్షంతో వర్షం కురిపిస్తుంది!

ఈ రోజు త్యాగమే రేపు గా వస్తుంది
త్యాగాలు యోగాలయి నిలుస్తాయి
త్యాగం చేసింది వృధా అవ్వదు
వృద్ధి చెంది తిరిగి అందుతుంది!
ప్రకృతి చెపుతున్న పాఠమిది!
పాటిస్తే అందరికీ వరమవుతుంది!!

**జగ్గయ్య.జి**
**9849525802**

# ప్రకృతి ఒడిలో




ఓ పరదేశి ఎక్కడనుండి వచ్చావు
అంతటితో ఆగక హృదయంలో చోటు
సంపాదించావు
నీ కళ్లలో నా ప్రతిబింబం
దాచుకున్నావు
ఎత్తు నుంచి ఉరుకుతున్న జలపాతాలు
చిన్న చిన్న పిల్లకాలువలు
తాగాలి ఈ తియ్యని నీళ్లు
చెయ్యాలి ఎన్నో ప్రమాణాలు

ఓ అద్భుతమైన ప్రకృతి చిత్రం
ఓ చెయ్యితిరిగిన చిత్రకారుడు
చిత్రించిన చిత్రం
ఈ పర్వత శ్రేణులు
మంచుతో కప్పబడిన సానువులు
హృదయానికి హత్తుకున్న దృశ్యాలు
సంవత్సరం పొడవునా శీతాకాలం
ఏ కవి కలానికి అందని అరుదైన
సౌందర్యం
అన్ని ఋతువులు వణికించే చలికాలం
అయితేనేం
అడ్డువేయడానికి ఉందిగా వెచ్చనైన
యవ్వనకాలం

విచ్చుకున్న పూలవనలతో నిండిన
ప్రకృతి ఆడంబరం
రాత్రికి రాత్రే అలంకరించిన సృష్టికర్త
అంతరంగం
ఇక్కడ జరుగుతున్నట్లుగా ఉంది పెళ్లి
సంబరం
మనసుమీద ఎవరికి ఉంది అధికారం
మనసు మాట వినదన్నది నిజం
ప్రేమ గుడ్డిది అన్నమాట నిజం
పరదేశి అయితేనేం
అదే మనసుచేసే మాయాజాలం

**అరుణ డేనియల్**
**9000606889**

# ఓ వర్షాకాలం ఉదయం



వెళ్ళనిచ్చేది లేదంటూ
కాళ్ళావేళ్ళా పడ్డాయి దిండూ,దుప్పట్లు
మాయచేసి మడతపెట్టాను
ఇంకా తెల్లారలేదు సామీ అంటూ
ఆవలించాయి మూల నక్కిన బూట్లు
సర్ది చెప్పి మడమ పెట్టాను
వీధిలోకి అడుగు పెట్టాను
కురిసి వెలిసినట్టుంది వాన
తొలకరి మబ్బు మాటిచ్చింది
తెరిపినిస్తాను, నిను నడవనిస్తానంటూ
రేయిలో రాలిన పూలు
మగత లోకి జారినట్టున్నాయి
హాయిగా కలవరిస్తున్నాయి

గూటిలో ఒదిగిన పక్షులు
గీటు దాటక ముడుచుకున్నాయి
కూత కూయక భీష్మించుకున్నాయి
పచ్చని చెట్లను పలకరిస్తూ
చల్లని గాలి కి పులకరిస్తూ
నడుస్తూ ఉన్నాను
మాట తప్పిన మబ్బు మెరుపులా
నవ్వింది
చిరుజల్లు చిలకరించి నిలువెల్లా
తడిపింది
మోసకారి తొలకరి మబ్బు!
పూటకో సారి ఏమార్చి పోతుంది
పరుగులిడుతూనే కరిగిపోతుంది
డాబుగా గడప దాటానా,
కడకు వాగులా ఇల్లు చేరాను
తల తుడుస్తూనే మళ్ళీ కురిసేను
నాపైన
ఈ సారి శ్రీమతి తిట్ల వాన.

**డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ.**
**ఫోన్: 9440836931.**

# మానవులంతా ఒకటే (అంకెల బాలగేయం)

ఒకటి... ఒకటి...ఒకటి...
జాతి,మతాలు వేరైనా
మానవులంతా ఒకటే!
రెండు...రెండు...రెండు...
కన్నులు రెండైనా చూపొకటే...
పెదవులు రెండైనా మాటొకటే!
మూడు...మూడు...మూడు...
సత్వ,రజస్,తమో
గుణములు మూడు...
తమో గుణమునకు
దూరంగా ఉండు!
నాలుగు...నాలుగు...నాలుగు..
కూడలిలో దారులు నాలుగైనా
ఎంచుకోవాల్సిన దారొకటే!
ఐదు...ఐదు...ఐదు...
చేతికి వేళ్ళు ఐదైనా
పిడికిలి బిగిస్తే ఒకటే!

ఆరు...ఆరు...ఆరు...
ఋతువులు అన్నీ ఆరు
క్రమం తప్పని తీరు!
ఏడు... ఏడు...ఏడు...
సంగీత స్వరములు ఏడైనా
రాగాల తీరు మారు!
ఎనిమిది...ఎనిమిది...ఎనిమిది
దిక్కులు మొత్తం ఎనిమిది
తూరుపు దిక్కు భానునిది!
తొమ్మిది...తొమ్మిది...తొమ్మిది
రత్నముల సంఖ్య తొమ్మిది
భారతరత్నాలి లకు నిలయమైన
దేశమిది!
పది...పది...పది
పదుగురితో కలిసిమెలిసి మెలగాలి
చరిత్రలో నీ పేరు నిలపాలి!

**చంద్రకళ. దీకొండ 9381361384**

# పారిజాతాపహరణం కథా సంగ్రహం



**వనం జ్వాలా నరసింహారావు**
**8008137012**



శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన తరువాత అతడి చెరలో వున్న పదహారు వేలమంది అప్సరసల కులానికి చెందిన లలనామణులను వివాహం చేసుకున్నాడు. ఆయనకు అప్పటికే ఎనిమిదిమంది పట్టపురాణులున్నారు. శ్రీకృష్ణుడు అందరు భార్యలను సమానంగా చూసుకుంటున్నప్పటికీ వారందరిలోకి రుక్మిణి, సత్యభామలకు ఎక్కువ చనువు ఇచ్చి ఆదరిస్తున్నాడు. ఒకనాడు శ్రీకృష్ణుడు రుక్మిణీదేవితో పాచికలాడుతున్నప్పుడు కలహప్రియుడైన నారదుడు అక్కడికి వచ్చాడు. శ్రీకృష్ణుడు ఆయనకు ఎదురేగి అతిథి సత్కారాలు చేశాడు. నారదుడు సాక్షాత్తు విష్ణుమూర్తైన శ్రీకృష్ణుడిని అనేక విధాల ప్రశంసించాడు. ఆ తరువాత తన దగ్గరున్న పారిజాత పుష్పాన్ని పైకి తీశాడు. అది బయటకు రాగానే తుమ్మెదలు దాని చుట్టూ మూగసాగాయి. ఆ పుష్పాన్ని ఒక బంగారు తామరాకులో చుట్టి శ్రీకృష్ణుడికి సమర్పించాడు నారదుడు. శ్రీకృష్ణుడు రుక్మిణీదేవికి ఆ పుష్పాన్ని ఇచ్చాడు. ఆమె దాన్ని తన కొప్పులో ముడుచుకున్నది. దానితో ఆమె అందం ఇనుమడించింది. ఆ తరువాత నారదుడు ఆ పుష్పం మహిమను రుక్మిణికి వివరించాడు. దాని మహిమ వల్ల సవతులంతా ఆమెకు దాసోహం అవుతారని చెప్పాడు. భర్త కూడా ఆమె మాట జవదాటడని అన్నాడు. రుక్మిణీదేవిని అమితంగా పొగిడి ప్రత్యేకంగా సత్యభామ పేరెత్తి దూషించాడు. రుక్మిణీదేవి అంతఃపురంలో జరిగిన సంగతి పూసగుచ్చినట్లుగా సత్యభామ చెలికత్తె తన యజమానురాలికి వివరించింది. సత్యభామకు ఆగ్రహం కలిగేలా చెప్పింది చెలికత్తె. చెలికత్తె మాటలు విన్న సత్యభామ కోపంతో రెచ్చిపోయింది. కోపంతో పాటు దుఃఖం పెల్లుబికింది. తప్పంతా కృష్ణుడిదే అని అన్నది. సత్యభామ కోప గృహంలోకి ప్రవేశించింది. మాసిన చీరె కట్టుకుంది. మౌనంగా వున్నది. ఆభరణాలన్నీ తీసేసింది. తలకు వాసెనకట్టు కట్టింది. కస్తూరి పట్టి నుదుటికి వేయించుకున్నది. ఒక మంచం మీద పొర్లింది. జుట్టు విరబోసుకున్నది. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణుడు సత్యభామ వుండే బంగారు సౌధానికి బయల్దేరాడు. సౌధం ముందు రథం దిగి లోపలి వెళ్లాడు. అంతా నిశ్శబ్దంగా వున్నదక్కడ. ఎవరైనా సత్యభామకు పారిజాత వృత్తాంతం చెప్పారేమో అని అనుమానిస్తూ కోపగృహంలోకి వెళ్లాడు. సత్యభామను చూసి ఆశ్చర్యపోయాడు. చెలికత్తె దగ్గరున్న విసనకర్రను తీసుకుని కృష్ణుడు తానే విసరసాగాడు. శ్రీకృష్ణుడిని చూడగానే సత్యభామ కనుల వెంట నీటి బిందువులు ఒలికాయి. సత్యభామను ఎన్నో విధాలుగా అనునయించాడు శ్రీకృష్ణుడు. సత్యభామ పాదయుగ్మమునకు నమస్కరించాడు. మహాకోపంతో వున్న సత్యభామ తన పాదాల వద్ద వున్న శ్రీకృష్ణుడి తలను తన ఎడమ కాలితో తన్నింది. అప్పుడు శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు: చ: నను భవదీయదాసుని మనంబున నెయ్యపుగిన్క బూని తాచినయది నాకు మన్ననయె చెల్వగు నీ పదపల్ల వంబు మత్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చు నంచు నేననియెద నల్క మానవుగదా యికనైక నరాళకుంతలా!శ్రీకృష్ణుడి మాటలకు సత్యభామ చర్రున లేచింది. ఆయన కల్లబొల్లి కబుర్లు కట్టిబెట్టమన్నది. ఇక ఆయన్ను నమ్మనన్నది. పారిజాత పుష్పం రుక్మిణికి ఇచ్చి తనను పరిహాసం చేశాడని అన్నది. తాను ఆత్మహత్య చేసుకుంటానని అన్నది. ఆమె గొంతు బొంగురు పోయింది. మాట పెగల్లేదు. అపురూపమైన పారిజాత పుష్పాన్ని నారదుడు స్వర్గలోకం నుండి తెస్తే దాన్ని తనకు ఇవ్వకుండా రుక్మిణికి ఇచ్చాడన్న ఈర్ష్య బయటపడింది. సత్యభామను అనునయించడానికి శ్రీకృష్ణుడు, తాను దేవతల విహారమైన నందనంలోకి వెళ్లి యుద్ధానికి ఎవరొచ్చినా ఎదిరించి, పారద్రోలి, ఏకంగా పారిజాత వృక్షాన్నే తీసుకువచ్చి సత్యభామకు ఇస్తానని అన్నాడు. ద్వితీయాశ్వాసంఈ నేపథ్యంలో అక్కడికి నారదుడు వచ్చాడు. ముగ్గురూ కలిసి భోజనశాలకు వెళ్లి భోజనం చేశారు. భోజనానంతరం శ్రీకృష్ణుడు చెలికత్తెలతో బంధువులందరికీ కర్పూర తాంబూలాలు ఇప్పించాడు. ఆ తరువాత సత్యభామ నారద, కృష్ణులు వున్న చోటుకు వచ్చింది. సత్యభామను దీవిస్తూ నారదుడు, ఆమె భర్త ఆమె కోరిన కోరికలన్నీ ఎంత కష్టసాధ్యమైనా తీర్చుగాక అని అన్నాడు. నారదుడు వెళ్లిపోవడానికి సిద్ధం కాగానే ఆయనతో శ్రీకృష్ణుడు, అదితిని మోసగించి నరకాసురుడు దొంగిలించిన కుండలాలను తానే త్వరలో వచ్చి ఇంద్రుడికి అందచేస్తానని ఆయనతో చెప్పమని అన్నాడు. నారదుడు వెళ్లిపోయిన తరువాత సూర్యుడు అస్తమించాడు. క్రమక్రమంగా చీకట్లు వ్యాపించాయి. అంధకారం జగమంతటా ఆక్రమించింది. ఆ తరువాత చంద్రుడు ఉదయించాడు. తెల్లవారు జామున శ్రీకృష్ణుడికి మేలుకొలుపు పాడారు వైతాళికులు. ఆయన మేల్కొన్నాడు. మేల్కొన్న శ్రీకృష్ణుడు కాలకృత్యాలు తీర్చుకొని సభ తీర్చి, గరుత్మంతుడిని తలచుకున్నాడు. ఆయన వెంటనే శ్రీకృష్ణుడి దగ్గరికి వచ్చాడు. వచ్చి శ్రీకృష్ణుడి పాదాలకు నమస్కరించాడు. నారదుడు వచ్చి పారిజాత పుష్పం ఇవ్వడం దగ్గర నుండి, తాను పారిజాత వృక్షాన్ని తీసుకు వస్తానని ప్రతిజ్ఞ చేయడం వరకు అన్ని విషయాలను గరుత్మంతుడికి చెప్పాడు. తరువాత సత్యభామతో కలిసి శ్రీకృష్ణుడు గరుడ వాహనాన్ని అధిరోహించాడు. ఆయన వెంట శ్రీకృష్ణుడి ఆయుధాలు కూడా బయల్దేరి వెళ్లాయి. మార్గమధ్యంలో కనిపించిన విశేషాలను సత్యభామకు వివరించాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడు అలా వివరిస్తూ సంతోషంగా మేరుపర్వత శిఖర ప్రదేశంలో దిగాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడు సత్యా సమేతుడై ఆనందంగా స్వర్గలోకానికి వచ్చాడు. తృతీయాశ్వాసం అంతకుముందే నారద ముని ద్వారా శ్రీకృష్ణుడి రాక గురించి తెలుసుకున్న ఇంద్రుడు శ్రీకృష్ణుడికి ఎదురు వచ్చాడు. రాగానే శ్రీకృష్ణుడి పాదాలకు నమస్కరించాడు. బ్రహ్మాదులకు కూడా అతి కష్టం మీద దర్శనం ఇచ్చే శ్రీమన్నారాయణుడు తనంతట తానే రావడం, తనకు దర్శనం ఇవ్వడంతో ఇంద్రుడు ఆనందభరితుడైపోయాడు. తన పాదాల మీద వాలిన ఇంద్రుడిని లేపి శ్రీకృష్ణుడు కౌగలించుకున్నాడు. ఇంద్రుడు మొక్కిన తరువాత అష్టదిక్పాలకులు కూడా శ్రీకృష్ణుడికి మొక్కారు. అంతా కలిసి బయల్దేరారు. ఆ తరువాత శ్రీకృష్ణుడు దేవమాత అయిన అదితిని దర్శించాడు. తన బంగారుబట్ట చెరగులో దాచి తెచ్చిన, నరకాసురుడు అపహరించిన ఆమె కుండలాలను తీసి అదితికి ఇచ్చాడు శ్రీకృష్ణుడు. అదితి శ్రీకృష్ణుడిని తన పక్కనే కూచోబెట్టుకొని శ్రీమహావిష్ణువు అవతారాలను (మత్స్యావతారం, కూర్మావతారం, వామనావతారం, పరశురామావతారం, రామావతారం, బలరామావతారం, బుద్ధావతారం) వర్ణించింది. ఆ తరువాత ఆయన్ను పలు రకాలుగా స్తుతించింది. ఆ తరువాత అదితి శ్రీకృష్ణుడితో సత్యభామా సహితంగా తన ఆతిథ్యం స్వీకరించాలని కోరింది. ఇంద్రుడు వైజయంతం అనే పేరుకల తన నివాసానికి రమ్మని అభ్యర్థించాడు. శ్రీకృష్ణుడు నవ్వుతూ సత్యాసమేతుడై వైజయంతానికి బయల్దేరాడు. అక్కడికి చేరుకున్న శ్రీకృష్ణుడు దానిలోనే అంతర్భాగంగా వున్న నందన వనాన్ని చూద్దామా అని సత్యభామను అడిగాడు. ఆ తరువాత ఇంద్రుడి నందనవనం దగ్గరికి శ్రీకృష్ణుడు, సత్యభామ మెల్లగా వెళ్లారు. అక్కడి ప్రకృతి రమణీయ దృశ్యాలను సత్యభామకు చూపిస్తూ శ్రీకృష్ణుడు నందనవనమంతా సంచరించాడు.చతుర్థాశ్వాసం శ్రీకృష్ణుడు సత్యభామతో నందనవనంలో సంచరిస్తూ స్వర్గలోకాన్ని అలంకరించే పారిజాతవృక్షాన్ని చూపించాడు. పారిజాతవృక్షం ప్రాశస్త్యాన్ని గురించి పలువిధాలుగా వర్ణించి చెప్పాడు. ఇంకా ఆలస్యం చేయకుండా ఆయన చేసిన శపథం నెరవేర్చే విధంగా ఆ దేవతా వృక్షాన్ని పెకలించి తన క్రీడా వనంలో నాటమని సత్యభామ శ్రీకృష్ణుడిని కోరింది. అలాగే చేస్తానని అంటూ ఆ కల్పవృక్ష పూలగుత్తిని ఆమె చెవికి అలంకారంగా పెట్టాడు. ఇంతలో మధ్యాహ్నం అయింది. ఆ తరువాత సూర్యాస్తమయం, చంద్రోదయం, సూర్యోదయం అయ్యాయి. అప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి పారిజాత వృక్షాన్ని అపహరించే ప్రయత్నంలో గరుత్మంతుడి వీపుమీద ఎక్కి నందనవనంలో ప్రవేశించాడు. శ్రీకృష్ణుడు ఆ కల్పవృక్షాన్ని పెకలించి గరుడుడి వీపుమీద పెట్టి సత్యభామకు సంతోషం కలిగించాడు. వనపాలకులు ఇది చూసి శ్రీకృష్ణుడిని అడ్డగించారు. వారికి పౌరుషం వుంటే శ్రీకృష్ణుడితో యుద్ధం చేసి విడిపించుకొమ్మని ఇంద్రుడికి చెప్పమని అంటుంది సత్యభామ. అదే విషయాన్ని శచీదేవితో కలిసి వున్న ఇంద్రుడికి చెప్పారు వనపాలకులు. దేవేంద్రుడి ఆస్థానం

## ప్రథమాశ్వాసం

ముందు యుద్ధభేరి మోగింది. దేవతా వీరులంతా ప్రగల్భాలు పలుకుతూ ఆయుధాలను ధరించి యుద్ధానికి బయల్దేరారు ఇంద్రుడితో సహా. అష్ట దిక్పాలకులు కూడా యుద్ధానికి బయల్దేరారు. పంచమాశ్వాసం యుద్ధం మొదలైంది. యుద్ధభూమిలో శ్రీకృష్ణుడి బాణాలకు దేవతల శరీరాలు కూలుతున్నాయి. అష్ట దిక్పాలకులు పలాయనం చిత్తగించారు. దేవసైన్యం అంతా శ్రీకృష్ణుడి ధాటికి యుద్ధరంగం విడిచి పారిపోగా, ఇంద్రుడు ఐరావతాన్ని శ్రీకృష్ణుడి మీదికి పురిగొల్పాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఒక బాణాన్ని దేవేంద్రుడి రొమ్మున నాటేలాగ వేశాడు. ఇరువురూ తీవ్రంగా యుద్ధం చేశారు. ఇంద్రుడి వజ్రాయుధం కూడా శ్రీకృష్ణుడిని ఏమీ చేయలేక పోయింది. ఆ వెంటనే తన అపరాధాన్ని మన్నింపమని వేడుకుంటూ ఇంద్రుడు శ్రీకృష్ణుడికి సాష్టాంగనమస్కారం చేశాడు. ఇంద్రుడి తప్పు ఏమీ లేదని అంటూ వజ్రాయుధాన్ని ఇచ్చేశాడు. కల్పవృక్షాన్ని కూడా ఇవ్వబోగా దాన్ని ఆయన వద్దనే వుంచుకొమ్మని వేడుకున్నాడు ఇంద్రుడు. ఆ తరువాత ఇంద్రుడి వద్ద సెలవు తీసుకున్నాడు శ్రీకృష్ణుడు. సత్యాసమేతుడై శ్రీకృష్ణుడు పారిజాతంతో నగర ప్రవేశం చేశాడు. యాదవకుల రాజులంతా సేనలతో ఎదురెల్లి వారిని ఆహ్వానించారు. వారు నగరంలోకి ప్రవేశించగానే పారిజాతవృక్ష సువాసనలు విస్తారంగా వ్యాపించాయి. శ్రీకృష్ణుడు స్వయంగా తన చేతులతో పారిజాతవృక్షాన్ని స్వత్యభామ చేతికి అందించాడు. సత్యభామ ఆ దివ్య వృక్షాన్ని తన మందిర ఉద్యానవన మధ్యప్రదేశంలో నాటి, దానికి ప్రతిదినం పూజలు చేస్తూ వుండేది. పారిజాత వృక్షం మనస్సులో కోరుకున్న కోరికలన్నీ తీరుస్తున్నది.ఇదిలావుండగా ఒకనాడు నారదుడు అక్కడికి వచ్చాడు. సత్యాకృష్ణులు చేసిన సత్కారాన్ని ఆనందంగా స్వీకరించాడు. సత్యభామను, ఆమె అదృష్టాన్ని పొగిడాడు. ఆమెను 'పుణ్యకవ్రతం' చేయమని సలహా ఇచ్చాడు. వ్రతం చేసే విధానం వివరించాడు. ఉదయమే నదికి వెళ్లి స్నానం చేయాలని, నవరత్నాభరణాలను ధరించాలని, సవతులందరినీ ఆ క్రితం రోజునే వ్రతానికి ఆహ్వానించాలని, వ్రతదీక్షను ఒక నెలరోజులు ఆచరించాలని, ఒక బ్రాహ్మణోత్తముడిని ఆచార్యుడిగా నియమించాలని, ఆయనకు విరివిగా దానాలని ఇవ్వాలని, వాటితో పాటు కల్పవృక్షంతో సహా భర్తను తగిన విధంగా ధారాదత్తం చేసి, మళ్లీ భర్తను స్వీకరించాలని, ఇలా చేస్తే ఇతరులెవరికీ సాధ్యం కాని సుఖాలను పొందవచ్చని నారదుడు చెప్పాడు. నారదుడి మాటలు విన్న సత్యభామకు ఆ వ్రతం చేయాలన్న కోరిక కలిగింది. భర్త శ్రీకృష్ణుడి అనుమతి తీసుకుని వ్రతం ఆరంభించింది.బంధువులు, స్నేహితులు, హితులు అంతా పుణ్యకవ్రతానికి వచ్చారు. విశ్వకర్మ రైవతక పర్వతం దగ్గర ఒక దాన మంటపాన్ని నిర్మించాడు. శ్రీకృష్ణుడు, సత్యభామ సమయోచితంగా మంగళస్నానాలు చేసి నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి, వ్రతదీక్షను పూనారు. దానం స్వీకరించడానికి నారద మహర్షిని ఎంచుకున్నారు. సత్యభామ నారద మహర్షికి యథోచితమైన పూజలు చేసింది. సత్యభామ భర్త అనుమతి తీసుకొని నారదుడి ఆజ్ఞప్రకారం కల్పవృక్షంతో, బంగారు వస్త్రాలతో ఒక మాలతో శ్రీకృష్ణుడిని చుట్టేసింది. భర్తను నారదుడికి దానంగా ఇచ్చింది. దానం స్వీకరించిన నారదుడు కల్పవృక్షానికి కట్టేసిన శ్రీకృష్ణుడి చెంగును విప్పేశాడు. ఇక తనకిష్టమైన పనులను చెయ్యమని ఆదేశించాడు. బ్రహ్మాది దేవతల పూజలను అందుకునే దేవాదిదేవుడు ఇప్పుడు నారదుడి వశం అయ్యాడు. నారదుడి జన్మ ధన్యమైంది. శ్రీకృష్ణుడితో పరిహాసానికి పనులు చేయించుకున్నాడు నారదుడు. తన వీణను మోయించాడు. అటూ-ఇటూ నడవమన్నాడు. శ్రీకృష్ణుడు ఆ పనులన్నీ నవ్వుతూ, ఆదరిస్తూ చేశాడు.ఆ తరువాత పతిని స్వీకరించమని, ఇస్తానని నారదుడు సత్యభామతో అన్నాడు. ఎంతో సంతోషించిన సత్యభామ నారద మహర్షికి తన ఆభరణాలన్నీ మూల్యంగా ఇచ్చింది. పారిజాత కల్పవృక్ష పుష్పాలను బంగారు పళ్ళాలలో వుంచి రుక్మిణి మొదలైన పదహారువేలమంది సవతులకు వాయనాలు ఇచ్చింది సత్యభామ. సగర్వంగా సత్యభామ తన వైభవాన్ని ప్రకటించింది. నారదుడు శ్రీకృష్ణుడిని పరిపరి విధాల, చిత్ర విచిత్రంగా స్తుతించాడు. పుణ్యకవ్రతం ముల్లోకాలు మెచ్చుకునే విధంగా పరిసమాప్తం అయింది. నారదుడు వెళ్లిపోయాడు. శ్రీకృష్ణుడు కూడా తన వారితో కలిసి దానమంటపం వద్ద నుండి ద్వారకా పట్టణానికి వెళ్లాడు. తన ఎనిమిదిమంది పట్టపు రాణులతోనూ, పదహారువేలమంది భార్యలతోనూ శ్రీకృష్ణుడు ఆనందంగా గడిపాడు.

**(బాలాంత్రపు వేంకట రమణ పుస్తక పరిచయం ఆధారంగా)**

# దాశరథి కృష్ణమాచార్య కలం యోధుడు, కవిత రథసారథి

**పూసపాటి వేదాద్రి**
**9912197694**



జన్మభూమి వెన్నెలలో, జ్ఞాన దీపం వెలిగించి, తెలంగాణ తల్లి కన్నీటిని, అక్షరాలతో తుడిచి కవిత ఖడ్గం చేత,అన్యాయాలతో పోరాడి, ప్రజల గుండెల్లో, స్వాతంత్ర్య స్ఫూర్తి నింపిన సాహితీ సునామి, దాశరథి కృష్ణమాచార్య."ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడ బానలమెంతో"!"ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో"! భూస్వాముల దౌర్జన్యాలకు! ధనవంతుల దుర్మార్గాలకు! దగ్ధమైన బతుకులు ఎన్నో! అని పేదల బ్రతుకుల గురించి దుర్మార్గుల దౌర్జన్యాల గురించి నేటికీ గొంతెత్తి పాడుకునే విధంగా చరిత్ర మరిచిపోని రీతిగా సాహిత్యాన్ని అందించారు."నా తెలంగాణ కోటి రతనాల వీణ"అని తెలంగాణ గొప్పతనాన్ని చాటి చెప్పిన మహాకవి.దాశరథి కృష్ణ దిమాచార్య 1925 జూలై 22న ఖమ్మం జిల్లా, గూడూరు గ్రామంలో జన్మించారు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషలలో పండితులుగా పేరుగాంచారు. ఉపాధ్యాయుడు, పంచాయితీ ఇన్స్పెక్టర్, ఆకాశవాణి ప్రయోక్తగా వివిధ పాత్రల్లో పనిచేశారు.కవి, నవల రచయిత, నాటక రచయిత, గేయ రచయిత, విమర్శకుడు, అనువాదకుడు ఇలా అనేక రంగాలలో దాశరథి తన ప్రతిభను చాటుకున్నారు. "అగ్నిధార" ఈ ఖండకావ్యం తెలంగాణ ప్రజల పోరాటాలకు ఒక శక్తివంతమైన గళం. నిజాం పాలనలోని అణిచివేత, దోపిడి, అన్యాయాలకు, వ్యతిరేకంగా ప్రజల తిరుగుబాటును ఇది చిత్రీకరిస్తుంది. ఈ కావ్యంతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ కావ్యం నిజాం పాలనలోని తెలంగాణ ప్రజల బాధలను, కవితాత్మకంగా వివరించారు. రుద్రవీణ, మహెూంద్రోదయం, రుద్రవీణ, అమృతాభిషేకం, నేత్రపర్వం, కవితపుష్పకం, బాలల గేయాలు, ఖబర్దార్ చైనా, తిమిరంతో సమరం వంటి ఎన్నో కవితా సంపుటాలను వెలువరించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం దాశరథి ఎల్లప్పుడూ గొంతెత్తి మాట్లాడేవారు. కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆ తర్వాత 70వ దశకంలో అనేక సినిమాలకు తనదైన శైలిలో పాటలను అందించారు. మొట్టమొదటిసారి 1961 లో విడుదలైన ఇద్దరి మిత్రులు సినిమాలు ఖుషి ఖుషి గా నవ్వుతూ చలాకి నవ్వులు రువ్వుతూ అంటూ చక్కనైన తెలుగు పాటను అందించి ఆ తర్వాత వాగ్దానం, అమర శిల్పి జక్కన్న, దాగుడుమూతలు, మూగమనసులు ఈ సినిమాలో గోదారి గట్టుంది గట్టుమీద పిట్ట ఉంది. అంటూ కమనీయమైన గీతాన్ని అందించారు. ఆ తర్వాత డాక్టర్ చక్రవర్తి, ఆత్మ గౌరవం, నవరాత్రి, పూలరంగడు, కంచుకోట, బంగారు గాజులు, శ్రీమంతుడు. ఇలా 1971 వరకు అనేక సినిమాలకు కమనీయమైన తెలుగు పాటలు రచించారు. 1967 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతిని అందుకున్నారు.1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి కళా ప్రపూర్ణ బిరుదు, మరియు కవిసింహం, అభ్యుదయ కవి సార్వభౌమ, యువకవిచక్రవర్తి, వంటి అనేక బిరుదులను అందుకున్నారు. 1977 నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా ఆంధ్ర కవితా సారథిగా తన సేవలను అందించారు.దాశరథి కృష్ణమాచార్య 1987 నవంబర్ 5న మరణించినప్పటికీ దాశరథి కృష్ణమాచార్య నేటికీ తెలుగు సాహిత్య రూపంలో తెలంగాణ ప్రజల హృదయాలలో పాట రూపంలో బ్రతికే ఉన్నాడనుటలో ఎలాంటి సందేహం లేదు.తెలుగు సాహిత్యంలోదాశరథి ఒక విప్లవకారుడిగా పరిగణించబడతారు. తన రచనల ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువలను ప్రోత్సహించారు.తెలంగాణ యాస, సంస్కృతిని తన రచనలలో ఎంతో చక్కగా చిత్రీకరించారు.నేటికీ ఆయన రచనలు తెలుగుసాహిత్యంలో ప్రముఖమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి."బానిస బతుకు బతుక కంటే బాణం తిని చావడమే మేలు","స్వేచ్ఛ లేని జీవితం శ్వాసలేని శవం లాంటిది","అన్నం లేని చోట అక్షరాలు ఎందుకు?"అంటూ దాశరథి చాలా శక్తివంతమైన శైలిలో భావోద్వేగా భరితమైన సాహిత్యాన్ని అందించారు. ప్రజల కష్టాలకు గొంతుకగా, పేదల బాధలకు పాటగా, మాటలతోటాలతోనే మార్పు తీసుకువచ్చిన మహాకవి. తెలుగు భాషకు తన వంతు సేవ చేసిన సాహితీ రథసారథి. కవిత నాటకం నవల కథ సినిమా ఎన్నో రకాల సాహితీ ప్రక్రియలులో, తన సృజనాత్మకతతో తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. కాలం మారినా, కలం మారినా, గళం మారినా, దాశరథి సాహిత్యం మాత్రం మన మదిలో నిలిచి తెలంగాణ ప్రజలకు స్ఫూర్తినిస్తూ తెలుగు ప్రజల గుండెల్లో అజరామరంగా వెలుగుతుంది.

**(జులై 22 దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా)**

# "మా వాట మాకేనంటూ" గళమెత్తిన బీసీలు



బీసీలు తమ అస్థిత్వాన్ని తాము వెతుక్కుంటూ తమ హక్కుల సాధన కోసం తండ్లాడుతున్న సందర్భంలో వారికి అండగా బీసీ విద్యావంతులు, ఆలోచనాపరులు, బీసీ కవులు, రచయితలు బహుజన ఉద్యమ రూపకల్పన చేయవలసిన సందర్భం ఆసన్నమైందని ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. పాలమూరు సాహితి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో జూలై 14 న జరిగిన " ధిక్కార " కవితా సంకలన ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి స్వీయ రాజకీయ అస్థిత్వమనే భావజాల ఆయుధం అందించినట్లుగానే ఇప్పుడు బడుగుల సాధికారిక ఉద్యమానికి భావజాల వేదికను రూపొందించాల్సిన బాధ్యత బీసీ మేధావులు తీసుకోవాలన్నారు. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయ పోరాటానికి, ఉత్పత్తి కులాలన్నింటిని ఏకం చేసే పనిలో బీసీ కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులు ఒక్కటిగా నిలిచి కదలాలన్నారు. బీసీలను ఓటు యంత్రాలుగా మార్చి 77 ఏళ్ళుగా పాలనను కొనసాగిస్తున్న పాలకుల నైజాన్ని తెలియజేస్తూ ఊరువాడలను ఏకం చేయాల్సిన పనిని బీసీ ఉద్యమకారులు చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అందుకు సిద్ధం కాకపోతే బీసీల నుంచి నిరసనను ఎదురుకోవాల్సి వస్తుందన్నారు. బీసీ కులగణనకు సంబంధించిన పనిని ఇప్పటివరకు ఆచరణరూపం తీసుకోలేదని బీసీలు ఆవేదనతో ఉన్నారన్నారు. బీసీల హక్కుల సాధనకు ఎవరు ఎంతవరకు నిలుస్తారన్న విషయాన్ని బీసీలు గమనిస్తున్నారని జూలూరు తెలిపారు. " ధిక్కార " పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ రచయిత, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల కోసం అహర్నిశలు కృషిసల్పిన గొప్ప మేధావన్నారు. జ్ఞాన సముపార్జన ద్వారానే రాజ్యాధికారం లభిస్తుందన్న పూలే వాక్కులు నేటికీ ఆచరణీయమన్నారు. దేశంలో కులవివక్షను తొలిసారిగా ఎలుగెత్తి చాటడమే కాకుండా దాని నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేసిన సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన లుంబిని పాఠశాల డైరెక్టర్ కె. లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ ఆధునిక సామాజిక భారత నిర్మాత మహాత్మా జ్యోతిరావు పూలే సమాజానికి అక్షరజ్ఞానాన్ని అందించి బాల్యవివాహాలను నిర్మూలన చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. సావిత్రి బాయి పూలేకు చదువు చెప్పించి ఆమెతోనే పాఠశాలలను నెలకొల్పిన సామాజి కవేత్త అని అన్నారు. పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పుస్తక సమీక్ష చేస్తూ " ధిక్కార " కవితా సంకలనంలోని 156 కవితలు మహాత్మా జ్యోతిరావు పూలే వ్యక్తిత్వాన్ని, సామాజిక ఉద్యమ స్వరూపాన్ని చక్కగా ఆవిష్కరించాయన్నారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కవులున్నారన్నారు. సాంఘీక, సాంస్కృతిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని కవులు పూలేను అభివర్ణించారన్నారు. ఒక్కొక్క కవిత ఒక్కో రీతిలో ఆలోచింపజేస్తుందన్నారు. పుస్తక సంపాదకులు వనపట్ల సుబ్బయ్య, కవులు నాగవరం బాలరాం, వహీద్ ఖాన్, కందికొండ మోహన్, బోల యాదయ్య, కొప్పోలు యాదయ్య, ఖాజామైనోద్దీన్, గన్నోజు శ్రీనివాసాచారి, విఠలాపురం పుష్పలత, కర్నాటి రఘురాములుగౌడ్, అంబటి భానుప్రకాష్ తదితరులు కవితాగానం చేశారు.

# 15వ జాతీయస్థాయి 'సోమేపల్లి' పురస్కారాలకు చిన్న కథలకు ఆహ్వానం



జాతీయస్థాయిలో గత పద్నాలుగు ఏళ్ళుగా తెలుగు చిన్న కథల పోటీలు నిర్వహిస్తూ తెలుగుసాహిత్యరంగంలో విశిష్ట అవార్డులుగా ప్రఖ్యాతని చాటుకుంటున్న సోమేపల్లి సాహితీ పురస్కారాలు ఈ ఏడూ ఇవ్వాలని సోమేపల్లివారి కుటుంబం నిర్ణయించింది. కథారచనను పరిపుష్టం చేసే ఉత్తమ కథలు వెలుగుచూడాలని, తద్వారా యువ రచయితలను ప్రోత్సహించి, తెలుగు కథ గొప్పదనాన్ని థదిశలా చాటాలనే లక్ష్యంతో... నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎప్పటిలాగే విజయవంతం చేయాల్సిందిగా అందర్నీ కోరుతున్నాము... బహుమతులు వివరాలు- అత్యుత్తమ కథకు రూ.2500/-, ఉత్తమ కథకు రూ.1500/-, మంచి కథకు రూ.1000/- ప్రత్యేక బహుమతులు రూ.500/-చొప్పున ఇద్దరికి ఇవ్వబడతాయి.ఈ పురస్కారం కొరకు పంపే కథల నిడివి రాతప్రతిలో రెండు నుంచి 4 పేజీలలోపు, డి.టి.పిలోనైతే 2 పుటలు కాగితం ఒక ప్రక్కనే రాయాలి. ఎటువంటి ఎంట్రీఫీజులేని ఈ పోటీలకు ఒకరు ఎన్ని కథలనైనా పంపవచ్చు. కథ పుటలపై రచయిత పేరుగానీ, ఆయా వివరాలు గానీ వుండకూడదు, కేవలం హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను ఆగస్ట్ 30వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 (సెల్:9247475975) అనే చిరునా మాకు పంపాలి. విజేతలకు నగదు బహుమతులతోపాటు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ప్రత్యేక సభలో సత్కరించబడుతుంది.

# వెయ్యి వాట్ల వెలుగుతెర

నడిరేయి నా నిదురలో కలన గణిత
సూత్రాలే కలల అలలను కరిగించేవి
నిన్ను చూడక ముందు..!
ఇప్పుడు అవి గతి తప్పి
నీచూపుల సిత్రాల సినిమాను
చూపిస్తున్నాయి..!!
సీతారామశాస్త్రి గారి కవనపు
అక్షరరాగాల వైపే ఆలోచనల
అడుగులు వేసే వాణ్ణి
నీరూపపు అరుణోదయకిరణాలు

నన్ను తాకకముందు..!
ఇప్పుడు అవి అలిగిపోయి
నీఅడుగుల తలపుల గుండెశబ్దాల
తీరాన్ని వెతుకుతున్నాయి..!!
ఐన్ స్టీన్ కాంతివేగపు సమీకరణాల
సంగీతపు మధురిమలో సివిరామన్
గారి
"నోబెల్ "రామన్ ఎఫెక్ట్ లో ఎన్నో వేల
మైళ్ళ ఫిజిక్స్ ప్రయాణపు పరిమళాన్ని
పొందాను..!

ఇప్పుడు నీ పరిచయపు స్పర్శ తరంగాల
అధ్యారోపణంలో అదుపుతప్పి పూర్తిగా
నువ్వయిపోయాను నేను..!!
నిత్యం ఇదే సత్యమై నామనసు పొరల్లో
నీ జ్ఞాపకాల సంద్రాన్ని ముద్రిస్తుంటే నా
కళ్ళ
నుంచి వెయ్యి వాట్ల వెలుగుతెర
ప్రకాశిస్తుంది..!!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

● గోదావరి ఉధ్రితిపై నిరంతరం నిఘా పెట్టండి
● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ,బ్యూరో ప్రతినిధి:రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం సాయంత్రం అన్ని జిల్లాల్లో వరద పరిస్థితిని సమీక్షించారు.జిల్లా యంత్రాంగం సహాయ పునరావాస చర్యల్లో నిమగ్నమై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల తోపాటు గోదావరి ఉధృతి వల్ల అక్కడి పరివాహ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా రెస్క్యూటీమ్‌లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టవలసిన రక్షణ సంబంధిత చర్యల గురించి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని తెలియ చేశారు. ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాల్లో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తెలియచేశారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునని మంత్రి అన్నారు. ముఖ్యంగా గోదావరి ఉధృతిపై నిరంతరం మానిటరింగ్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# బడ్జెట్ సమావేశాలకు ముందు అఖిలపక్ష భేటీ



● కన్వార్ యాత్ర సహా పలు అంశాలపై చర్చ ● నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ జరగాలని పట్టు
● తృణమూల్ కాంగ్రెస్ తప్ప మిగతా పార్టీలన్నీ హాజరు ● ఒడిశాకి ప్రత్యేక హెూదా కావాలని బిజూ జనతాదళ్ డిమాండ్
● అదే బాటలో నితీష్ కుమార్ నడిచేలా ఉంది

న్యూఢిల్లీ : మరో రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ని ప్రవేశపెట్టనుంది. లోక్సభ ఎన్నికల ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ని ప్రవేశపెట్టిన మోదీ సర్కార్ ఇప్పుడు పూర్తి స్థాయి పద్దుని తీసుకు రానుంది. ఈ క్రమంలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తప్ప మిగతా పార్టీలన్నీ హాజరయ్యాయి. పార్లమెంట్లో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపక్ష నేతలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కాంగ్రెస్ తరఫున సీనియర్ నేతలు జైరామ్ రమేశ్ వెళ్లారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ కచ్చితంగా జరగాలని ఆయన పట్టుపట్టారు. వైసిపి తో పాటు జనతా దళ్ (యునైటెడ్), బిజూ జనతా దళ్ పార్టీల నేతలూ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ మూడు పార్టీలూ తమ తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్ వినిపించారు. ఒడిశాకి ప్రత్యేక హోదా కావాలని బిజూ జనతా దళ్ డిమాండ్ చేస్తోంది. అటు ఎన్డిఏ మిత్రపక్షమైన జేడీయూ కూడా ఇదే అడుగుతోంది. నితీశ్ కుమార్ ఈ డిమాండ్ నెరవేర్చుకోవాలనే ఉద్దేశంతోనే కూటమిలో చేరారన్న వాదనా ఉంది. వీటితో పాటు యూపీలో జరగనున్న కన్వార్ యాత్రపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే ఈ యాత్ర దేశవ్యాప్తంగా సంచలనమవుతోంది. యోగి సర్కార్ పెట్టిన కొన్ని నిబంధనలు రాజకీయంగా అలజడి సృష్టించాయి. ఈ యాత్ర జరిగే దారి పొడవునా షాప్స్ కచ్చితంగా నేమ్బోర్డ్స్ పెట్టుకోవాలని, ఓనర్ల పేర్లూ రాయాలని ప్రభుత్వం ఆదేశించింది. హలాల్ ఉత్పత్తులు విక్రయించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఈ నిబంధనలే వివాదాస్పదమయ్యాయి. ముస్లిం వ్యాపారులను లక్ష్యంగా చేసుకునే ఈ నిబంధనలు పెట్టారని కొందరు వాదిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ విమర్శల్ని పట్టించుకోడం లేదు. కచ్చితంగా ఈ నిబంధన పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జులై 22వ తేదీన మొదలవుతాయి. ఆగస్టు 12వ తేదీ వరకూ ఈ సమావేశాలు కొనసాగున్నాయి. కేంద్ర ప్రభుత్వం మొత్తం 6 కీలక బిల్స్ని ప్రవేశపెట్టాలని ప్లాన్ చేసుకుంది. 90 ఏళ్ల నాటి ఎయిర్ క్రాఫ్ ఏక్ట్ నీ మార్చేందుకు వీలుగా కొత్త బిల్ని ప్రవేశపెట్టనుంది. జమ్ముకశ్మీర్కి సంబంధించిన పద్దు వివరాలనూ వెల్లడించనుంది. బడ్జెట్ని ప్రవేశపెట్టే ముందు రోజు..అంటే జులై 22న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్లో ఆర్థిక సర్వే వివరాలు వెల్లడిస్తారు. మరుసటి రోజు పద్దు ప్రకటిస్తారు.

# రిజర్వేషన్లలో కోటాను తగ్గించండి

● బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు కీలక తీర్పు! ● రోజులుగా బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు
● ఆదివారం అత్యవసరంగా విచారించిన సుప్రీంకోర్టు



ఢాకా: బంగ్లాదేశ్లో వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాను తగ్గించాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో కొన్నిరోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఉపశమనం లభించినట్లయింది. వారం రోజులుగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. దాదాపు 100 మందికి పైగా నిరసనకారులు మృ‌‌‌‌త్యువాత పడ్డారు. ఎతిచెందారు. ఉద్యోగాలు లేక అసహనంతో ఉన్న విద్యార్థులు ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. 1971లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినవారి కుటుంబ సభ్యులకు 30 శాతం కోటా కల్పిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రవేశపెట్టింది. దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 2018లోనే ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. విద్యార్థులు నిరసన తెలియజేయటంతో వెనక్కి తగ్గింది. జూన్లో బంగ్లా హైకోర్టులో కోటాను పునరుద్ధరిస్తూ తీర్పు వెలువడటంతో మళ్లీ ఆందోళనలు మిన్నంటాయి.దీనిపై నేడు అత్యవసరంగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు స్వాతంత్ర్య సమరయోధుల కోటాను ఐదు శాతానికి తగ్గించాలని ఆదేశించింది. 93 శాతం నియామకాలు ప్రతిభ ఆధారంగానే చేపట్టాలని స్పష్టం చేసింది. మిగిలిన రెండు శాతం మైనారిటీలు, ట్రాన్స్జెండర్లు, దివ్యాంగులకు కేటాయించాలని సూచించింది. జనవరిలో జరిగిన ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వచ్చింది. ఆమెకు తాజా ఆందోళనలు తీవ్ర సవాల్ విసిరాయి. యూనివర్సిటీలు మూతపడ్డాయి. ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ప్రజలు బయటకు రావొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. మంగళవారం ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఢాకా వర్సిటీలో పోలీసులు, విద్యార్థులకు మధ్య ఘర్షణలతో ఇవి ప్రారంభమయ్యాయి. వీటిని అదుపు చేసేందుకు టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు కూడా ప్రయోగించడంతో అల్లర్లు మరింత తీవ్రమయ్యాయి. దీంతో ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. సైన్యం రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో అనేక మంది మృ‌‌త్యువాత పడ్డారు. ఎతిచెందారు. మరణాలపై అక్కడి ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. స్థానిక మీడియా మాత్రం 103 మంది మరణించినట్లు వెల్లడించింది.రిజర్వేషన్ వ్యవస్థ వివక్షాపూరితంగా ఉందని ఆందోళనకారులు ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఆవామీ లీగ్ పార్టీకి చెందిన హసీనా మద్దతుదారులకు అనుకూలంగా ఉందని నిరసన వ్యక్తం చేశారు. దాని స్థానంలో ప్రతిభ ఆధారిత నియామకాల వ్యవస్థను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. హసీనా మాత్రం రిజర్వేషన్ వ్యవస్థను సమర్థించారు. దేశం కోసం పోరాడిన వారికి గౌరవం దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.తాజా ఆందోళనల్లో ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మద్దతుదారులు సైతం పాల్గొన్నారు. వీరి వల్లే హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని అధికార పక్షం ఆరోపించింది. రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలా చేస్తున్నారని పేర్కొంది. బీఎన్పీ మాత్రం వాటిని కొట్టిపారేసింది. తాము శాంతియుత నిరసనలకే పిలుపునిచ్చామని వివరణ ఇచ్చింది.బంగ్లాదేశ్లో చదువుకుంటున్న పలువురు భారత విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి చేరుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 1,000 మంది విద్యార్థులు వచ్చారు. వారిలో 778 మంది సరిహద్దు మార్గాల ద్వారా రాగా, మరో 200 మంది విమానాల్లో సొంత దేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించారు.

# ఘనంగా ఉజ్జయిని
# మహంకాళి బోనాలు



● అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి ● మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు
● భారీగా తరలివచ్చిన భక్తులు ● ఆలయ పరిసరాల్లో సందడి

తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః సికింద్రాబాద్లో ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. మహంకాళికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు ముఖ్యమంత్రికి వేదమంత్రోచ్చరణల నడుమ ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మహాకాళి అమ్మవారిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు జరుపుకునే పవిత్రమైన రోజున అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో వందల ఏళ్లుగా బోనాల ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఎవరు ఏ రంగంలో ఉన్నా.. ఎంత స్థాయిలో ఉన్నా దేవతలను పూజించే విధానాలు ఒకేలా ఉంటాయన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని అధికారులను సీతక్క ఆదేశించారు. తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్.. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టువస్త్రాలతోపాటు అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. బోనాల జాతర సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొన్నది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

**అమ్మవారి దర్శనంలో హర్యానా గవర్నర్**

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు గవర్నర్కు స్వాగతం పలికారు.

**అమ్మవారి దర్శనంలో సీఎస్**

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమె బోనం ఎత్తుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.

**భారీ బందోబస్తు..**

సికింద్రాబాద్ ఉజ్జయిని ఉజ్జయిని మహంకాళి బోనాలకు భారీ భద్రత ఏర్పాటుచేశామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎప్పటిలాగానే బోనాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయని తెలిపారు. బోనాలకు అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేశామన్నారు. పోలీస్ శాఖ నుండి 1500 మంది బందోబస్తులో విధుల్లో ఉన్నట్లు తెలిపారు. మహిళల భద్రత దృ‌ష్ట్యా షి టీమ్స్ ఏర్పాటుచేశామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో బోనాలు కొనసాగుతున్నాయన్నారు. మహంకాళి పోలీస్ స్టేషన్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నామని సీపీ తెలిపారు.

# దేశ వ్యతిరేక శక్తులన్నీ ఏకం అవుతున్నాయి



● కాంగ్రెస్ పార్టీ తప్పడు ప్రచారం చేస్తోంది ● మూడవ సారి గెలిచి చరిత్ర సృష్టించిన మోడీ
● ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా దేశాభివృద్ధి ఆగదు ● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః 2024పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యతిరేక శక్తులన్ని బీజేపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు, కుట్రలు చేశాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు తొలగిస్తారని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని మోడీ చరిత్ర సృష్టించారని కేంద్ర మంత్రి చెప్పారు. చరిత్రలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ని కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు అవమానించిందని, ఆయన్ని ఎన్నికల్లో ఓడించాలని కుట్రలు చేసినట్లు ఆయన చెప్పుకొచ్చారు. అధికారం, ఎన్నికలతో సంబంధం లేకుండా సంస్థాగతంగా ముందుకెళ్లే పార్టీ బీజేపీ మాత్రమే అని అన్నారు. దేశంలో సిద్ధాంతపరంగా, కార్యకర్తల ఆధారంగా, ప్రజాస్వామ్యయుతంగా నడుచుకునే పార్టీ బీజేపీనే అని కార్యకర్తలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి జవహర్ లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి నరేంద్ర మోడీ ఘనత సాధించారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్లో దేశ వ్యతిరేక శక్తులను పెంచి పోషించేందుకు వీలుగా ఉన్న ఆర్టికల్ 370ని రద్దు చేసి బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు హక్కులు కల్పించిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100సీట్లు కూడా సాధించలేదు కానీ రాహుల్ గాంధీ మాత్రం తానే ప్రధానమంత్రి అయిపోయినట్లు ఊహల్లో తేలిపోయారని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో ఎన్నికల్లో ఓడిపోయి సంబరాలు చేసుకున్న పార్టీని మొదటిసారి చూశానని కాంగ్రెస్ను ఉద్దేశించి ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎలక్షన్ ప్రచారం చేసుకోవచ్చుని కానీ దేశ వ్యతిరేక శక్తులు, తీవ్రవాద శక్తులు చాప కింద నీరులా వ్యాపించి బీజేపీకి వ్యతిరేకంగా అనేక కుతంత్రాలు చేశాయన్నారు. ఓడిపోయిన తర్వాత అసహనంతో పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అబద్ధాలు, తప్పుడు ఆరోపణలతో విషం చిమ్మారని ధ్వజమెత్తారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదం, కుటుంబ పాలన, అవినీతి బాగా పెరిగిపోయినట్లు దేశ ప్రజలు గ్రహించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. అందుకే మూడుసార్లు ఎన్డీయేకి పట్టం కట్టారన్నారు. దేశంలో ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా అణచివేసిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్లో బాంబుపేలుళ్లతో ప్రజలు వణికిపోయారు. బొగ్గు కుంభకోణం, కామన్ వెల్త్ కుంభకోణం, 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం వంటి అనేక కుంభకోణాలతో సుమారు రూ. 12లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆయన ఆరోపించారు. మోడీ ప్రభుత్వంలో దేశంలో అభివృద్ధి పరంగా అనేక మార్పులు వచ్చాయని, రానున్న పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం మరోసారి బయటపడుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. లోక్ సభ జరగకుండా అడ్డుపడటం, రాజ్యాంగం గురించి అబద్ధాలు ప్రచారం చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ వ్యవహరించేందుకు సిద్ధమైందని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు

# విశ్వకర్మ పథకాన్ని తీసుకువచ్చింది కేంద్రం

● ఈ పథకాన్ని విశ్వకర్మలు ఉపయోగించుకోవాలి ● ప్రొఫెసర్ జయశంకర్ సార్ జన్మించిన కులం విశ్వకర్మది
● విశ్వకర్మల ఆత్మహత్యలు బాధాకరం ● బిజెపి ఎంపీ ఈటల రాజేందర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకాన్ని తీసుకువచ్చి వారి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రయత్నిస్తుందని బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కమ్మర, వడ్రంగి కులవృత్తుల సమస్యలపై వద్ద ఇందిరాపార్క్ వద్ద ఏర్పాటుచేసిన మహాధర్నా కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ని కన్న జాతి ఇది. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మాహుతి చేసుకున్న శ్రీకాంతచారి ఈ జాతి బిడ్డ.ఆ జాతి సమస్యలు పరిష్కరించకుండా వారి కళ్ళలో కేసీఆర్ మట్టి కొట్టారు. అందుకే ఈజాతి ఉసురు తగిలినట్టుంది. పేదవాడికి ఆకలి ఉండవచ్చు కానీ ఆత్మగౌరవం ఉంటుంది. గత ప్రభుత్వం వేధించింది వీరి ఉసురు తాకిందన్నారు. మీకు తాకకుండా ఉండాలంటే వీరి సమస్య పరిష్కారం ఇవ్వాలన్నారు. కేంద్రం విశ్వకర్మ పథకం తీసుకువచ్చింది దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. నేనే దీనికోసం ప్రత్యేకంగా ఆఫీసు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. విశ్వకర్మల గురించి మహాభారతంలో గొప్పగా చెప్పబడింది. కూడు, గూడు, గుడ్డ అందించడంలో విశ్వకర్మ పాత్ర ఉందనీ, విశ్వకర్మ లేకుంటే మానవ కళ్యాణం లేదన్నారు. ఆధునీకరణ వల్ల కులవృత్తులను కోల్పోయామనీ, విశ్వకర్మ ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబం మొత్తం చేసుకొన్నారు. బంగారానికి వన్నె తెచ్చే తేజాబ్ మింగి చనిపోతున్నారు. ఆ ఆత్మహత్యలు ఆపడానికి గత ప్రభుత్వానికి చేతులు రాలేదు. మన కులవృత్తులు వాళ్ళం ఏం అడుగుతున్నామన్నారు. ఆధునీకరణకు అనుగుణంగా యాంత్రీకరణ కోసం లోన్లు అడుగుతున్నాము. విశ్వబ్రాహ్మణులు గ్రామాల్లో ఉపాదిలేక సిటీకి వచ్చి మురుగు ప్రాంతాల్లో బిక్కు బిక్కు మంటూ బ్రతుకు వెళ్లదీస్తున్నారు. హరితహారం కార్యక్రమం పేరుతో ఎలుకల బాధకు ఇళ్లను తగలబెట్టుకున్నట్టు ఉంది. మీరు అడవి కాపాడాలంటే ఆదిలాబాద్ ఆడవులను కాపాడండనీ అన్నారు. పెద్ద పెద్ద వారిని వదిలిపెట్టి వడ్డెరలు నడుపుకుంటున్న మిషన్లను మాత్రం బాన్ చేయడం దుర్మార్గం.చట్టాలు పేదలకు అనుకూలంగా ఉండాలనీ,రాజ్యాంగం సమస్త సంపదలు సమస్త ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

# ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన మోదీ, రాహుల్, ప్రియాంక, రేవంత్, భట్టి, షర్మిల**



ఢిల్లీ: కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 82వ జన్మదిన వేడుకలు ఆదివారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు సందర్భంగా ఖర్గేకు ప్రధాని మోదీ, లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సహా దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నా అని మోదీ ఎక్స్లో పేర్కొన్నారు. ప్రజల కోసం మీరు చేసే నిర్విరామ సేవ, అంకితభావం నాకు ప్రేరణగా నిలిచింది. జన్మదిన శుభాకాంక్షలు. మీకు దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నా అని రాహుల్ గాంధీ ఎక్స్లో పోస్ట్ చేశారు.

**రాజకీయ జీవితం.. :** ఖర్గే తన కాలేజీ రోజుల్లో విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు. రాజకీయ జీవిత తొలినాళ్లలో లా డిగ్రీని పూర్తి చేసిన తర్వాత.. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్గా ఉన్న మాజీ జస్టిస్ శివరాజ్ వి పాటిల్ కార్యాలయంలో అసిస్టెంట్గా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించాడు. 1972లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసి గుర్మిత్కల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

అలా 1972, 1978, 1983, 1985, 1989, 1994, 1999, 2004, 2008, 2009 ఎన్నికల్లో వరుసగా 9 సార్లు గెలిచి విజయానికి కేరాఫ్గా మారారు. 2005లో ఖర్గే.. సాహెబ్ కర్నాటక రాష్ట్ర అధ్యక్ష కమిటీకి ఛైర్మన్గా నియమితులయ్యారు. 2022 అక్టోబర్ 18న కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

# ఢిల్లీలో బిజీ బిజీగా సీఎం రేవంత్

● కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో భేటీ!
● రుణమాఫీ అంశాన్ని వివరించనున్న సీఎం



తెలంగాణ బ్యూరో‌ప్రతినిధిః తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారు. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సీఎం ఢిల్లీ బయల్దేరారు. కాసేపటిక్రితం ఢిల్లీ చేరుకున్న సీఎం.. సాయంత్రం కాంగ్రెస్ అధిష్టానం పెద్దలను కలవనున్నారు. రాష్ట్రంలో చేపట్టిన రైతు రుణమాఫీ అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానంకు సీఎం రేవంత్ రెడ్డి వివరించనున్నారు. మరోవైపు వరంగల్లో రైతు కృతజ్ఞత సమావేశానికి రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. ఈ సమావేశంలో నూతన పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, క్యాబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఢిల్లీ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఉన్న విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఈ ఇద్దరు సాయంత్రం కాంగ్రెస్ అధిష్టానంతో భేటీ కానున్నారు. భేటీ అనంతరం హైదరాబాద్ తిరిగిరానున్నారు. నేడు రైతు కృతజ్ఞత సభ తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది.

# భద్రకాళీ అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: వరాలనిచ్చే చల్లనితల్లి.. ఓరుగల్లు వాసుల ఇలవేల్పు దైవం.. ఆషాఢంలో ఆరంభపూజలు అందుకునే శక్తిస్వరూపిని.. భద్రకాళి అమ్మవారి దేవాలయం లో శాకంబరి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భద్రకాళీ అమ్మవారిని తొలి దర్శనం చేసుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 టన్నుల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. శాకంబరీ అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వర్షం పడుతున్నా.. భక్తులు తడుస్తూ క్యూలైన్లలో నిల్చున్నారు. అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు శాకాంబరితో ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయ ప్రాంగణానికి పోటెత్తారు. భద్రకాళీ శరణం అంటూ భక్తులు చేసిన అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగుతోంది. భద్రకాళి అమ్మవారిని కూరగాయలతో అలంకరించి ఆరాధించడంవల్ల కరువుకాటకాలు దరిచేరవని, కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. ఆషాఢశుద్ధ పాడ్యమినాడు ప్రారంభమయ్యే శాకంబరీ ఉత్సవాలు పౌర్ణమి వరకు జరుగుతాయి. శాకంబరీ ఉత్సవాల సమయంలో ఒక్కసారైనా అమ్మవారిని దర్శించుకుని కోరికలు కోరుకుంటే ఖచ్చితంగా ఆ కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: గురు పౌర్ణమి పురస్కరించుకొని పలు షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ లోని కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఆశయాలు అతిపెద్ద కాలనీలా పేరుందిన కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోనీ రోడ్ నెంబర్ 2 లో గల సాయిబాబా గుడి నిర్వాహకులు ఎల్. నాగేశ్వరరావు, ఎల్. రాజా ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జనసేన రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, భగవాన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పి ఎస్ ఆర్ కే భగవాన్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కలిగినేడి ప్రసాద్, అడబాల షణ్ముఖ , వులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

**బోనాల పండుగలో... :** ఆషాడ మాస భోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ రోడ్డు మైసమ్మ దేవాలయంలో శ్రీనివాసరెడ్డి ఆహ్వానం మేరకు పూజలలో పాల్గొన్న కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అనంతరం అమ్మవారి ప్రాంగణం లో శ్రీనివాస రెడ్డి , బాల్ రెడ్డి, వినయ్ రెడ్డి , బేతి రమేష్ , రమేష్ , ప్రేమ కుమార్ గారికి శాలువాలతో సత్కరించారు. బోనాల ఉత్సవాల్లో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, వులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులకు జలకళ

● ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు ● ప్రాజెక్టుల్లోకి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:ఏపీ, తెలంగాణలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లోని వాగులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతాన్ని ముంచెత్తిన వర్షానికి వరద నీరు తెలంగాణలోని ప్రాజెక్టులకు వచ్చి చేరుతోంది. దీంతో తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు పెరిగాయి. ఏ ప్రాజెక్టులో ఎంత నీరుందనే వివరాలు..కృష్ణా నదిపై ఉన్న జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 318.5 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 317.5 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఇన్ ఫ్లో 76 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నుంచి అధికారులు 84,236 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 813 అడుగులకు చేరింది. ప్రస్తుతం 82,396 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. ప్రాజెక్టు ఇప్పట్లో నిండుకునే సూచనలు కనిపించకపోవడంతో అధికారులు నీటిని కిందికి వదలడం లేదు.

నాగార్జున సాగర్: ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు. ప్రస్తుత నీటిమట్టం కేవలం 123 టీఎంసీలు మాత్రమే. ఇన్ ఫ్లో 4,694 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. 8,480 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.ప్రకాశం బ్యారేజీ: పంటకాలువలకు ఔట్ ఫ్లో 1,309 క్యూసెక్కులు కాగా 7,125 క్యూసెక్కుల నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1,091 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1,066 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి వరద నీరు 19 వేల క్యూసెక్కులుగా ఉందని అధికారులు వెల్లడించారు. ఔట్ ఫ్లో ఏమీలేదు.

మిడ్ మానేరు: ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటిమట్టం కేవలం 5.57 టీఎంసీలు మాత్రమే ఉంది. మిడ్ మానేరులోకి 236 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, 62 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 402 అడుగులు. ప్రస్తుతం 2,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఔట్ ఫ్లో ఏమీలేదు. కాగా, భద్రాచలంలో గోదావరి నది ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరికకు దగ్గరగా అంటే 33.5 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు.. స్పిల్ వే ఎగువ 30.6 మీటర్లు, స్పిల్ వే దిగువ 20.6 మీటర్లు, కాపర్ డ్యామ్ ఎగువ 30.3 మీటర్లు, కాపర్ డ్యామ్ దిగువ 20.15 మీటర్లు. ప్రస్తుత ఔట్ ఫ్లో 5.87 క్యూసెక్కులు.

## రికార్డు సృష్టిస్తున్న

# తెలుగింటి కోడలు




### ఏడవసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్

**కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మరోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోనే ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. గతంలో కంటే బిజేపీకి మెజార్టీ తగ్గినా.. మిత్రపక్షాల సహకారంతో అధికారంలోకి వచ్చింది. మంత్రుల్ని కూడా నియమించింది. అయితే చాలా వరకు కీలక మంత్రిత్వ శాఖల్లో పాత వారినే కొనసాగించింది. ఆర్థిక మంత్రిగా మరోసారి తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్నే నియమించింది మోదీ సర్కార్. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అందరి కన్నా ఇప్పుడు కేంద్ర బడ్జెట్‌పైనే ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి 1న ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌పై అందరి దృష్టి పడింది. మరిన్ని వివరాలలోకి వెళితే....**

### సెషన్ తొలిరోజే బడ్జెట్

ఇప్పుడు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు లో జులై 22న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు, కేంద్ర ఆర్థిక మంత్రి హోదాలో నిర్మలమ్మ. పార్లమెంట్ సెషన్ జులై 22న మొదలై.. ఆగస్టు 9 వరకు కొనసాగుతాయిన పార్లమెంట్ సెషన్ తొలిరోజే బడ్జెట్ ను ప్రవేశపెడుతారు. ఇక బడ్జెట్ ప్రవేశపెట్టేకంటే ముందే ఎకనామిక్ సర్వే (ఆర్థిక సర్వే) ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన తర్వాతి నుంచే బడ్జెట్ పనులు ప్రారంభమవుతాయి. ఓటాన్ బడ్జెట్లో పెద్దగా ఎలాంటి వరాలు కురిపించలేదు మోదీ సర్కార్. దీంతో ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్లో దాదాపు అన్ని వర్గాలు తమకు ఆకర్షణీయంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుందని భావిస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి. ఇప్పటికే ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిర్మలమ్మ.. బడ్జెట్ పనులు ప్రారంభించాలని సదరు శాఖ సీనియర్ అధికారుల్ని ఆదేశించినట్లు తెలిసింది.

### లైవ్ స్ట్రీమింగ్

బడ్జెట్ సమర్పణ జులై 23వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా లైవ్ స్ట్రీమింగ్ చూడాలనుకునే వారికి చాలా ఆప్షన్లు ఉంటాయి. వివిధ ప్లాట్ ఫామ్స్ లైవ్ కవరేజీని అందిస్తుంటాయి. ప్రధానంగా పార్లమెంటుకు సంబంధించిన ఛానల్ సంసద్ టీవీలో లైవ్ కవరేజీ ఉంటుంది. అలాగే దూరదర్శన్ ఛానల్, వాటికి సంబంధించిన యూట్యూబ్ ఛానళ్లలో బడ్జెట్ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. మరోవైపు.. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఆన్లైన్ ప్లాట్ ఫామ్లో బడ్జెట్ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. అలాగే ఫైనాన్షియల్ న్యూస్ వెబ్సైట్స్ లైవ్ ఫీడ్స్, రియల్ టైమ్ అప్డేట్స్ ఎప్పటికప్పుడు అందిస్తాయి. న్యూస్ ఛానళ్లలోనూ ప్రత్యక్ష ప్రసారాలు ఉంటాయి.

### అరుదైన ఘనత

తాజా బడ్జెట్తో నిర్మలా సీతారామన్ వరుసగా ఆరుసార్లు పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనతను సాధించబోతున్నారు. వాస్తవానికి ఇందిరా గాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళ నిర్మలా సీతారామన్.. ప్రధాని హోదాలో ఉంటూ నాడు ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారతదేశంలో తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రిగా ఎక్కువ కాలం కొనసాగిన నేతగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే రికార్డును నమోదు చేసుకున్నారు. ఇప్పుడు ఆరోసారి పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశబెట్టి.. మరో రికార్డును తిరగరాయనున్నారు. ఇంతకుముందు వరుసగా ఐదు కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్, అరుణ్జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్సిన్హా, మన్మోహన్సింగ్ను ఆమె అధిగమించనున్నారు. 1959 నుంచి 1964 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఐదు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. మొత్తంగా మొరార్జీ దేశాయ్ 10సార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఇన్నాళ్లు అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరు మీదే ఉంది. దీనిని ఎవ్వరూ బ్రేక్ చేయలేదు..




### కొత్త పోకడలు

వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టడంలోనూ నిర్మల సీతారామన్ కొత్త పోకడలు తీసుకొచ్చారు. సంప్రదాయ బ్రీఫ్కేస్ విధానానికి ఆమె మంగళం పాడారు. జాతీయ చిహ్నంతో కూడిన ఖాతా పుస్తకం తరహాలో ఉండే బ్యాగులో ఆమె బడ్జెట్ పత్రాలు తీసుకొచ్చే సంప్రదాయానికి ఆమె శ్రీకారం చుట్టారు. 2019లో తొలి బడ్జెట్ నుంచి ఆమె ఖాతా బుక్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పటి వరకు అతి సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం రికార్డు, అతి స్వల్ప ప్రసంగం రికార్డు కూడా నిర్మలా సీతారామన్ పేరిటే ఉన్నాయి. 2020లో ఆమె చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాలు సాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆమె చేసిన 57 నిమిషాల ప్రసంగం ఇప్పటి వరకు చేసిన ప్రసంగాల్లో అత్యల్పమైనది. నిర్మలా సీతారామన్.. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆమెను కొనసాగుతున్నారు. మోదీ త్రీ పాయింట్ ఓ లో మొత్తం ఐదేళ్ల కాలానికి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొనసాగితే అది కూడా ఒక రికార్డవుతుంది.. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

### బీమా కవరేజీ పరిమితి పెంపు

పీటీఐ నివేదిక ప్రకారం.. ఎన్డీయే ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద లబ్ధిదారుల సంఖ్యను, బీమా మొత్తాన్ని పెంచడాన్ని పరిశీలిస్తోంది. మూలాధారాల నుండి వచ్చిన సమాచారం ప్రకారం, లబ్ధిదారులకు ఇచ్చే హామీ మొత్తం పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచాలని ఇప్పుడు పరిశీలిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ బీమా యోజన కింద వచ్చే మూడేళ్లలో లబ్ధిదారుల సంఖ్యను రెట్టింపు చేయడంపై ఎన్డీఏ ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. వచ్చే మూడేళ్లలో ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద లబ్ధిదారుల సంఖ్యను రెట్టింపు చేయడంపై దృష్టి సారించవచ్చు. దీని వల్ల దేశ జనాభాలో మూడింట రెండు వంతుల మందికి నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఈ నివేదిక ప్రకారం, దేశంలోని పెద్ద సంఖ్యలో జనాభా అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు వెలుగులోకి రావడంతో వారికి చికిత్స కోసం భారీ ఉపశమనం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందుకోసం బీమా కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచే అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు.

### ప్రభుత్వ ఖజానాపై భారం పెరుగుతుంది

ఈ నెలాఖరులోగా జూలై 23న కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టనుంది. బీమా రంగంలో ఈ భారీ నిర్ణయం ఈ బడ్జెట్లో ప్రకటించే అవకాశం ఉంది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద బీమా మొత్తాన్ని పెంచుతూ నిర్ణయం ప్రకటిస్తే ప్రభుత్వ ఖజానాపై రూ.12,706 కోట్ల అదనపు భారం పడనుంది. 70 ఏళ్లు పైబడిన పౌరులతో సహా దాదాపు 4-5 కోట్ల మంది లబ్ధిదారులు ఈ పథకంలో పాల్గొంటారని అంచనా. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అనంతరం ఆర్థిక సర్వేను అధికారిక వెబ్సైట్లో డౌన్లోడ్ చేసుకోవచ్చు. అధికారిక యూట్యూబ్ ఛానల్, ట్విట్టర్ హ్యాండిల్లో ప్రెస్ కాన్ఫరెన్స్ లైవ్ వీక్షించవచ్చు. బడ్జెట్ సమావేశాలు జులై 22వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారు. జులై 23 వ తేదీ ఉదయం 11 గంటలకు బడ్జెట్ ఉంటుంది.



### పాత, కొత్త పన్ను విధానాల్లోనూ..


ప్రస్తుతం ఎన్పీఎస్ డిడక్షన్స్ అనేది పాత, కొత్త పన్ను విధానాలలో కూడా అందుబాటులో ఉంది. ఇది వృాఎద్ధాప్య భద్రతను అందించడానికి నిర్వచించబడిన సహకారం-ఆధారిత పదవీ విరమణ పొదుపు పథకం. దీనిని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) నియంత్రిస్తోంది. దీనిలో విరాళాలు, సంపాదనలు పన్ను-మినహాయింపును కలిగి ఉంటాయి. కానీ ఉపసంహరణలపై పాక్షికంగా పన్ను పడుతుంది.

### బడ్జెట్ 2024 అంచనాలు..

జీతం కలిగిన పన్ను చెల్లింపుదారులు ఎన్పీఎస్ లో ఎలాంటి మార్పులు కోరుకుంటున్నారంటే.. ప్రస్తుతం, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద రూ. 50,000 స్వచ్ఛంద సహకారంపై అదనపు మినహాయింపు పాత పన్ను విధానంలో మాత్రమే అనుమతిస్తుంది. కొత్త పన్ను విధానంలో కూడా పేర్కొన్న మినహాయింపును అనుమతించాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానం రెండింటిలోనూ ఎన్పీఎస్ కి యజమాని కంట్రిబ్యూషన్ (10% పరిమితి)కి సంబంధించి మినహాయింపు అనుమతించబడుతుంది. ఈ పరిమితిని 12%కి పెంచడాన్ని ప్రభుత్వం పరిగణించాలని కోరుకుంటున్నారు. ఇది వేతనాలు పొందే వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులందరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రస్తుతం రూ. 50,000గా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్ కొత్త పన్ను విధానంలో కూడా అనుమతి ఉంది. పెరిగిన జీవన వ్యయం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల దృాఎష్ట్యా, బడ్జెట్ 2024లో పరిమితిని రూ.75,000కి పెంచడాన్ని ప్రభుత్వం పరిగణించాలని కోరుకుంటున్నారు. ఇది ఎంచుకున్న పన్ను విధానంతో సంబంధం లేకుండా జీతం పొందే వ్యక్తులందరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. కొత్త పన్ను విధానంలో ప్రాథమిక మినహాయింపు పరిమితిని కనీసం రూ. 50,000 పెంచవచ్చు. ఇది కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులందరికీ (జీతం లేదా జీతం లేని) ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ మార్పులు కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోవడానికి వ్యక్తులను ప్రోత్సహిస్తాయి.




### ఆర్థిక సర్వే అంటే ఏంటి?



బడ్జెట్ సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగం తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వే- 2024 సమర్పిస్తారు. బడ్జెట్ ప్రవేశపెట్టే ఒక రోజు ముందు ఆర్థిక సర్వే పార్లమెంటుకు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. మొట్ట మొదటి ఆర్థిక సర్వే 1950- 51 లో ఆవిష్కరించారు. అయితే వార్షిక బడ్జెట్కు ముందు రోజు ఆర్థిక సర్వేను ఎందుకు సమర్పిస్తారు?అసలు దీనికి ఎందుకంత ప్రాముఖ్యం? ఈ ఆర్థిక సర్వేలో ఏముంటుంది? గత ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా ఉంది అనే విషయాలను తెలియజేయడమే ఈ ఆర్థిక సర్వే ముఖ్య ఉద్దేశం. ఆర్థిక సర్వే 2024 లో 2023-24 ఆర్థిక ఏడాదిలో దేశ ఆర్థిక స్థితి ఎలా ఉందో తెలియజేస్తుంది. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్, ఎకనామిక్స్ డివిజన్ ఈ ఫ్లాగ్షిప్ నివేదికను తయారు చేస్తుంది. ప్రధాన ఆర్థిక సలహాదారు ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సర్వే సిద్ధం చేస్తారు. ఆర్థిక శాఖ మంత్రి పార్లమెంట్లో ఈ ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారు. తర్వాత చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ మీడియాతో వివరాలు వెల్లడిస్తారు.మన దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు ఎలా ఉంది అనేది ఈ ఆర్థిక సర్వే వివరిస్తుంది. గత ఆర్థిక ఏడాదిలో భారత ఆర్థికాభివృాఎద్ధి, జీడీపీ ఎలా ఉంది? తర్వాత ఏడాది ఎలా ఉండబోతుందని ఆర్థిక సర్వే అంచనా వేస్తుంది. రాబోయే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో సూచిస్తుంది. బడ్జెట్లో కేటాయింపులను సైతం ఆర్థిక సర్వేకు అనుగుణంగా కేటాయిస్తారు. 1950- 51 ఆర్థిక సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతున్నారు. కొన్నేళ్లుగా దీనిని రెండు భాగాలుగా ప్రవేశపెడుతోంది కేంద్రం. తొలి భాగంలో ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు ఉండగా.. రెండోభాగంలో గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన రివ్యూ ఉంటుంది.



## పారిస్ ఒలింపిక్స్
# ఐవోఏకు బీసీసీఐ రూ.8.5 కోట్లు


దిల్లీ: విశ్వ క్రీడాసంబరం ఒలింపిక్స్ ఈనెల 26 నుంచే ప్రారంభం కానుంది. పారిస్ వేదికగా వైభవంగా క్రీడలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎప్పట్లాగే ఎన్నో ఆశలతో భారత బృఎందం కూడా ఒలింపిక్సు సిద్ధమైంది. ఈ ఒలింపిక్స్లో భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు 20 క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. ఇప్పటికే కొంతమంది క్రీడా గ్రామానికి చేరుకున్నారు. ఈ ఒలింపిక్స్లో పాల్గొనే భారత అథ్లెట్లకు మద్దతుగా నిలిచేందుకు బీసీసీఐ () ముందుకొచ్చింది. బోర్డు తరఫున భారత ఒలింపిక్ అసోసియేషన్కు రూ.8.5 కోట్లు అందజేస్తున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా పేర్కొన్నారు. 2024 పారిస్ ఒలింపిక్స్లో భారత్కు ప్రాతినిధ్యం వహిస్తున్న అథ్లెట్లకు బీసీసీఐ మద్దతుగా నిలిచింది. మేము భారత ఒలింపిక్ అసోసియేషన్కు రూ.8.5 కోట్లు అందిస్తున్నాము అని జై షా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు.

# అభిమానికి ఊహించని బహుమతి



దంబుల్లా: టీమిండియా వైస్-కెప్టెన్ స్మృతి మంధాన తన అభిమానికి ఊహించని బహుమతి అందజేసింది. శ్రీలంకకు చెందిన దివ్యాంగురాలైన అదీషా హెరాత్కు మంధాన అంటే ఎనలేని అభిమానం. దాంతో ఆసియా కప్లో భాగంగా శుక్రవారం పాకిస్థాన్తో జరిగిన మ్యాచ్కు తల్లి సాయంతో వీల్చైర్లో హాజరైంది అదీషా. విషయం తెలుసుకున్న మంధాన మ్యాచ్ అనంతరం హెరాత్ను కలిసింది. తన ఫేవరెట్ క్రికెటర్ను కలిసిన ఆనందంలో ఉన్న అదీషాను.. మరింత ఆశ్చర్యపరుస్తూ ఆమెకు మొబైల్ ఫోన్ బహుమతిగా అందజేసింది.

## అప్పుడే వీడ్కోలు చెప్పాలి
# ధోనీ రిటైర్మెంట్ స్ట్రాటజీ ఇదే



ఎంఎస్ ధోనీ.. క్రికెట్లో ఈ పేరే ఓ సంచలనం. అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికినా.. ఐపీఎల్లో అభిమానులను అలరిస్తున్నాడు మహీ. అతడి కోసమే సీఎస్కే మ్యాచ్లు చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో మైదానాలకు తరలివస్తున్నారంటే.. ధోనీ క్రేజ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఇక ధోనీకి ఇదే చివరి సీజన్ అంటూ ప్రతీ ఐపీఎల్ టోర్నీలో ప్రచారం జరగడం.. అతడు ఆటను కొనసాగించడం చూస్తూనే ఉన్నాం. అయితే.. వచ్చే సీజన్లో ధోనీ ఆడకపోవచ్చని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ధోనీ రిటైర్మెంట్ స్ట్రాటజీని టీమ్ఇండియా పేసర్ మహమ్మద్ షమీ వివరించాడు.

ఓ యూట్యూబ్ ఛానల్లో షమీ మాట్లాడాడు. మీరు ధోనీ భవిష్యత్ గురించి ప్రశ్నలు అడుగుతారు. అయితే.. దీనికి చూద్దాం లే అని అతడే సమాధానమిచ్చాడు. రిటైర్మెంట్కు సంబంధించి ధోనీతో నేను మాట్లాడా. ఒక ఆటగాడు ఎప్పుడు రిటైర్ కావాలి..? అని మహీ భాయ్ను అడిగా. మొదట మీరు ఆటపై విసుగు చెందినప్పుడు.. రెండోది.. జట్టు నుంచి మిమ్మల్ని తొలగించబోతున్నారని తెలిసినప్పుడు అని ధోనీ సమాధానమిచ్చాడు అని వివరించాడు.

అయితే.. ముఖ్యమైన విషయం ఎంటంటే.. ఎప్పుడైతే మీ ఆటను మీరు ఎంజాయ్ చేయరో, బోరింగ్గా ఫీలవుతారో.. అప్పుడు రిటైర్మెంట్కు సమయం వచ్చిందని సంకేతం. ఆటకు వీడ్కోలు చెప్పడానికి అదే ఉత్తమ సమయం. మీ శరీరం సహకరించందని మీకు సూచనలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. ఒక ఆటగాడు రిటైర్ కావడానికి అదే తగిన సమయం అని షమీ పేర్కొన్నాడు.


ధోనీ టీమ్ఇండియా క్రికెట్లో ఆల్టైమ్ గ్రేట్ ఆటగాళ్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. అతడి నాయకత్వంలోనే భారత్.. పొట్టి ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలను నెగ్గింది. ఇక ఐపీఎల్లో అత్యుత్తమ సారథిగా చెన్నై సూపర్కింగ్స్ను విజయ పథంలో నడిపించాడు. అత్యధికంగా ఐదు సార్లు ఆ జట్టుకు టైటిల్స్ అందించాడు. గత సీజన్లో కెప్టెన్సీ బాధ్యతలను వదిలేసి.. కీపర్ బ్యాటర్గా కొనసాగాడు. అవసరమైనప్పుడు తన వ్యూహాలను అందించి జట్టును ముందుకు నడిపించాడు. అయితే వచ్చే సీజన్లో ధోనీ ఆడడని.. జట్టుకు వేరే రూపంలో సేవలు అందిస్తాడని ప్రచారం జరుగుతోంది.

# ధోని స్థానంలోకి పంత్?



ముంబయి: ఐపీఎల్లో మహేంద్రసింగ్ ధోని ఇంకో సీజన్ కొనసాగడం సందేహంగానే ఉంది. ఈ ఏడాదే అతను ఐపీఎల్కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని అనుకున్నారు కానీ.. సీజన్ చివర్లో అలాంటి ప్రకటనైతే రాలేదు. అయితే తాజా పరిణామాలు చూస్తుంటే ధోని వచ్చే సీజన్లో ఆడడం అనుమానమే. దిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్గా ఉన్న రిషబ్ పంత్ వచ్చే సీజన్కు సీఎస్కేకు మారనున్నట్లు సమాచారం. ధోని స్థానాన్ని పంత్తో భర్తీ చేయడానికి చెన్నై చూస్తోందట. ధోని వచ్చే ఏడాది ఆడతాడో లేదో కానీ.. పంత్ మాత్రం దిల్లీని వీడి సీఎస్కేతో కలవడం ఖాయమంటున్నారు. మరోవైపు లఖ్నవూ కెప్టెన్ కేఎల్ రాహుల్.. ఆ జట్టుకు గుడ్బై చెప్పి బెంగళూరులో చేరనున్నాడట. గత సీజన్లో లఖ్నవూ యజమాని.. రాహుల్ను బహిరంగంగా తిడుతున్నట్లు కనిపించిన వీడియో దుమారం రేపింది.

# పంతం నెగ్గించుకున్న గంభీర్



## టీమ్ ఇండియా బౌలింగ్ కోచ్‌గా కేకేఆర్ మాజీ పేసర్

టీమ్ఇండియా ప్రధాన కోచ్గా నియమితుడైన గౌతమ్ గంభీర్ సహాయక సిబ్బందిని ఖరారు చేసుకునే పనిలో పడ్డాడు. ఇప్పటికే శ్రీలంక టూర్కు జట్టులో ఎంపిక తన మార్క్ చూపించిన గంభీర్.. సహాయక సిబ్బంది విషయంలోనూ తన ముద్ర ఉండేలా చూసుకుంటున్నాడు. తాను సూచించిన వారినే కోచింగ్ స్టాఫ్లో భాగం చేయాలని బీసీసీఐని కోరాడు. బౌలింగ్ కోచ్ కోసం ఆర్.వినయ్ కుమార్, మోర్నీ మోర్కెల్, లక్ష్మీపతి బాలాజీ పేర్లను గంభీర్ బీసీసీఐకి సూచించాడు. మోర్నీ మోర్కెల్ను బౌలింగ్ కోచ్గా నియమించేందుకు బీసీసీఐ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఫార్మాలిటీస్ ఇంకా పూర్తి కాలేదు. కానీ, అవి త్వరలో పూర్తవుతాయని ఆశిస్తున్నాము. శ్రీలంక సిరీస్ తర్వాత మోర్నీ మోర్కెల్ బాధ్యతలు స్వీకరించే అవకాశముంది బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. మోర్కెల్, గంభీర్ గతంలో కలిసి ఆడారు. 2014లో కోల్కతా నైట్రైడర్స్ గంభీర్ సారథ్యంలో టైటిల్ సాధించింది. అప్పుడు మోర్నీ మోర్కెల్ కేకేఆర్ జట్టులో ఉన్నాడు. గంభీర్ లఖ్నవూకు మెంటార్గా ఉన్న సమయంలో మోర్కెల్ లఖ్నవూ బౌలింగ్ కోచ్గా పనిచేశాడు. మోర్కెల్కు అంతర్జాతీయ క్రికెట్లో కోచ్గా పనిచేసిన అనుభవం కూడా ఉంది. కొంతకాలంపాటు పాకిస్థాన్ జట్టుకు అతడు బౌలింగ్ కోచ్గా వ్యవహరించాడు. టీమ్ఇండియా మాజీ ఆటగాడు అభిషేక్ నాయర్తో పాటు నెదర్లాండ్స్ మాజీ ఆల్రౌండర్ టెన్ డస్కాటే గంభీర్ బృఎందంలోకి అసిస్టెంట్ కోచ్లుగా రానున్నట్లు సమాచారం.

## టీమ్ఇండియా సహాయ
# కోచ్‌లుగా నాయర్, డస్కాటే



దిల్లీ: భారత క్రికెట్ జట్టు కొత్త కోచ్ గౌతమ్ గంభీర్.. తన సహాయ సిబ్బందిని ఖరారు చేసుకునే పనిలో పడ్డాడు. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్తో పాటు ఆయన సహాయ సిబ్బంది కూడా తమ పదవుల నుంచి తప్పుకోనున్నారు. టీమ్ఇండియా మాజీ ఆటగాడు అభిషేక్ నాయర్తో పాటు నెదర్లాండ్స్ మాజీ ఆల్రౌండర్ టెన్ డస్కాటే గంభీర్ బృఎందంలోకి రానున్నట్లు సమాచారం. ఆటగాడిగా కెరీర్ ముగిశాక నాయర్.. రాబిన్ ఉతప్ప, దినేశ్ కార్తీక్ లాంటి ఆటగాళ్లకు వ్యక్తిగత కోచ్గా పని చేసి మంచి పేరు సంపాదించాడు. ఒకప్పుడు గంభీర్ కోల్కతా నైట్రైడర్స్కు కెప్టెన్గా ఉండగా.. డస్కాటే ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం మేజర్ క్రికెట్ లీగ్లో నైట్రైడర్స్ జట్టుకు సహాయ కోచ్గా పని చేస్తున్నాడు. నాయర్, డస్కాటే ఈ నెలాఖర్లో మొదలయ్యే శ్రీలంక పర్యటనలో గంభీర్ బృఎందంలో చేరనున్నారు. వీరితో పాటు ఒక బౌలింగ్ కోచ్ కూడా నియమితుడు కావాల్సి ఉంది. ఇందుకోసం వినయ్ కుమార్, లక్ష్మీపతి బాలాజీ, మోర్నీ మోర్కెల్ల పేర్లను గంభీర్ బీసీసీఐకి సూచించాడు. వీరిలో ఒకరిని త్వరలోనే బౌలింగ్ కోచ్గా ప్రకటించే అవకాశముంది.

# కెప్టెన్సీ వివాదంలో కొత్త ట్విస్టు.. అదే హార్దిక్ పాండ్యా కొంపముంచింది



టీమిండియా ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యాను కెప్టెన్గా నియమించకపోవడంపై సర్వత్రా చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. రోహిత్ శర్మ వారసుడు అతడేనని అంతా ఫిక్సైన తరుణంలో.. సూర్యకుమార్ను టీ20 సారథిగా, శుభ్మన్ గిల్ను వైస్ కెప్టెన్గా ఎంపిక చేసి బీసీసీఐ ఊహించని షాక్ ఇచ్చింది. ఇక అప్పటి నుంచి హార్దిక్ను ఎందుకు పక్కకు తప్పించారనేది హాట్ టాపిక్గా మారింది. ఈ క్రమంలోనే.. ఫిట్నెస్ వల్లే అతడ్ని ఎంపిక చేయలేదని కొందరు, శ్రీలంకతో వన్డేలకు దూరంగా నిర్ణయించుకోవడం వల్లే పాండ్యాకు పగ్గాలు అప్పగించలేదని మరికొందరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.అయితే.. ఇప్పుడు ఈ వ్యవహారంలో సరికొత్త ట్విస్టు వెలుగు చూసింది. పాండ్యాకు కెప్టెన్సీ దక్కకపోవడం వెనుక ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్తో పాటు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పాత్ర కూడా ఉందని తెరమీదకి వచ్చింది. పాండ్యా కెప్టెన్సీపై ఆయనకు పూర్తి నమ్మకం లేదని, అందుకే అతనిని పక్కకు తప్పించారని సమాచారం. ఓ అంతర్జాతీయ కెప్టెన్కు ఉండాల్సిన లక్షణాలు, సామర్థ్యం పాండ్యాలో లేవని సెలక్షన్ టీమ్ భావించినట్లు ఓ నివేదిక పేర్కొంది. ఐపీఎల్లో ముంబై ఇండియన్స్ కెప్టెన్గా తన మార్క్ చూపించకపోవడం, పూర్తిగా ఫెయిల్ అవ్వడమే పాండ్యా కొంపముంచినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పాండ్యాపై తీవ్ర విమర్శలు రావడంతో.. అతని కెప్టెన్సీ స్కిల్స్పై అగార్కర్ సంతృప్తిగా లేరన్న వాదనలు వినిపిస్తున్నాయి.అంతేకాదు.. డ్రెస్సింగ్ రూమ్లో పాండ్యా ప్రవర్తన కన్నా సూర్యకుమార్ ప్రవర్తన బాగుంటుందని సహచర ఆటగాళ్లు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. పాండ్యా వ్యవహరించే తీరుతో పోలిస్తే సూర్య చాలా సున్నితంగా ఉంటాడని.. అందుకే సూర్యకే కెప్టెన్సీ ఇప్పించాలని అందరూ తమ మద్దతు తెలిపినట్లు వార్తలొస్తున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్ని బట్టి చూస్తుంటే.. పాండ్యా తన ఆల్రౌండ్ ప్రదర్శన సత్తా చాటాల్సిందేనని అనిపిస్తోంది. ఇదే అతని ముందున్న అతిపెద్ద సవాల్లాగా కనిపిస్తోంది. బ్రేకులు తీసుకోకుండా.. ఫిట్నెస్పై పూర్తి దృఎష్టి సారించి.. తన విశ్వరూపం చాటాలి. అప్పుడే.. జట్టులో అతని స్థానానికి ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు. లేకపోతే.. ఏమైనా జరగొచ్చని క్రీడావర్గాలు పేర్కొంటున్నాయి.


## నటాషాతో విడాకులు
# ఇప్పుడు అనన్యతో..!



నటాషాతో హర్థిక్ పాండ్యా అలా విడిపోయారో లేదో అనన్య పాండేతో జతకట్టారు. అంటే ఇద్దరూ సోషల్ మీడియా ఇన్ స్టాగ్రామ్లో ఒకరికొకరు ఫాలో అవుతున్నారు. దాని కన్నా ముందు అనంత్ అంబానీ పెళ్లి వేడుకలో హర్థిక్ పాండ్యా- అనన్య పాండేతో కలిసి స్టెప్పులు వేశారు.


నటాషాతో హర్థిక్ పాండ్యా అలా విడిపోయారో లేదో అనన్య పాండేతో జతకట్టారు. అంటే ఇద్దరూ సోషల్ మీడియా ఇన్ స్టాగ్రామ్లో ఒకరికొకరు ఫాలో అవుతున్నారు. దాని కన్నా ముందు అనంత్ అంబానీ పెళ్లి వేడుకలో హర్థిక్ పాండ్యా- అనన్య పాండేతో కలిసి స్టెప్పులు వేశారు. దాంతో ఇద్దరి మధ్య ఫ్రెండ్ షిప్ పీక్కు చేరినట్టుంది. వీళ్లిద్దరి మధ్య ఏం జరుగుతోంది అనే డిస్కషన్కు దారితీసింది. ఇద్దరు లవ్లో ఉన్నారా..? పెళ్లి చేసుకుంటారా..? అని నెటిజన్లు ప్రశ్నలు వేస్తున్నారు.

# పతకాలు పట్టుకొచ్చేదెవరు?









ఒలింపిక్స్లో భారత పతకాలు ఆశిస్తున్న విభాగాల్లో రెజ్లింగ్ ఒకటి. గత నాలుగు ఎడిషన్లుగా మన రెజర్లు మెడల్స్ కొల్లగొడుతూనే ఉండడంతో.. దేశంలో కుస్తీ క్రీడకు క్రేజ్ పెరిగింది. 2008లో కాంస్యంతో యావత్ దేశాన్ని ఉర్రూతలూగించిన సుశీల్ కుమార్ ఆ తర్వాత లండన్ క్రీడల్లో...

ఒలింపిక్స్లో భారత పతకాలు ఆశిస్తున్న విభాగాల్లో రెజ్లింగ్ ఒకటి. గత నాలుగు ఎడిషన్లుగా మన రెజర్లు మెడల్స్ కొల్లగొడుతూనే ఉండడంతో.. దేశంలో కుస్తీ క్రీడకు క్రేజ్ పెరిగింది. 2008లో కాంస్యంతో యావత్ దేశాన్ని ఉర్రూతలూగించిన సుశీల్ కుమార్ ఆ తర్వాత లండన్ క్రీడల్లో రజతం సొంతం చేసుకొన్నాడు. 2012లో యోగేశ్వర్ దత్ కాంస్యంతో మెరిశాడు. 2016లో సాక్షి మాలిక్ కంచు మోత మోగించగా.. 2020 టోక్యోలో రవి దహియా, బజ్రంగ్ పూనియాలు రజత, కాంస్యాలతో అదరగొట్టారు. అయితే, ఈ క్రీడకు బలమైన పునాదులు పడుతున్న క్రమంలో అంతర్గత రాజకీయాలు, లైంగిక వేధింపుల ఆరోపణలు, తిరుగుబాట్లతో ఒక్కసారిగా అథఃపాతాళానికి పడిపోయింది. పారిస్ క్రీడలకు ఆరుగురు మాత్రమే అర్హత సాధించారు. వీరిలో పతకాలు గెలిచే సత్తా ఉన్న వారు ఎవరు? అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.

అంతిమ్ పంగల్..: దేశానికి తొలి పారిస్ కోటా బెర్తు ఖరారు చేసింది. 53 కిలోల విభాగం బరిలోకి దిగనున్న పంగల్ పతకం సాధించాలనే పట్టుదలతో ఉంది. ప్రత్యర్థుల పట్టుకు చిక్కకుండా తప్పించుకోవడం అంతిమ్ స్పెషల్. వెన్ను గాయం కారణంగా పోటీలకు దూరమవడంతో తగినంత సాధన చేయలేకపోయింది. అంతర్జాతీయ అనుభవం కూడా తక్కువే.

అన్షు మాలిక్..: దూకుడుగా ఆడే అన్షు 57 కిలోల విభాగంలో ఆడనుంది. జూనియర్ స్థాయిలో ప్రకంపనలు సృఎష్టించినా.. సీనియర్ విభాగంలో ఆశించినంత ప్రదర్శన చేయలేకపోయింది. ఫిట్నెస్పై కూడా అనుమానాలున్నాయి.

నిషా దహియా..: బెదురు లేకుండా ప్రత్యర్థిపై అటాక్ చేయడం నిషా స్టైల్. 68 కిలోల విభాగంలో సైలెంట్గా బెర్త్ పట్టేసింది. ఎక్కువ సేపు బౌట్ సాగితే అలసిపోతుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటుందనే దానిపై పతక ఆశలు ఆధారపడి ఉన్నాయి.

రీతిక హుడా..: ఊహించని రీతిలో ప్రత్యర్థిపై దాడి చేయగల నేర్పు రీతిక సొంతం. 76 కిలోల్లో గట్టిపోటీ ఇవ్వగల రెజ్లర్లలో హుడా కూడా ఉంది. బౌట్ చివర్లలో ప్రత్యర్థికి పాయింట్లు ఇచ్చుకోవడం రీతికకు మైనస్గా మారుతోంది.

వినేష్ ఫొగట్

బరిలో ఉన్న భారత అత్యుత్తమ మహిళా రెజ్లర్ ఫొగట్ అనడంలో సందేహం లేదు. ఈసారి 50 కిలోల విభాగంలో వినేష్ బరిలోకి దిగుతోంది. అదను చూసి దాడి చేస్తూనే.. చాకచక్యంగా తనను తాను రక్షించుకోగలదు. అయితే, తక్కువ వెయిట్ విభాగానికి మారడం కోసం శరీరాన్ని ఎంతో ఒత్తిడికి గురి చేసింది. పైగా ఏడాదికి పైగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల తగినంత ప్రాక్టీస్ చేయలేదనే చెప్పుకోవాలి.

అమన్ షెహ్రవత్

జట్టులో ఒకే ఒక్క పురుష రెజ్లర్. 57 కిలోల ట్రయల్స్లో ఒలింపిక్ పతక విజేత రవి దహియాకు షాకిచ్చి పారిస్ బెర్త్ పట్టేశాడు. ఎక్కువ సమయం పోరాడగలగడం అమన్ బలమైనా.. సాంకేతికంగా ఎంతో బలహీనం. వ్యూహాత్మకంగా ఆడలేడు. ప్లాన్-బి అనేది ఉండదు.

# క్రీడా గ్రామంలో భారత్ అడుగు



పారిస్: పారిస్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో భారత్ అడుగుపెట్టింది. దేశం నుంచి మొదటగా ఆర్చరీ, రోయింగ్ బృఎందాలు క్రీడా గ్రామాన్ని చేరుకున్నాయని ఈ ఒలింపిక్స్కు భారత చెఫ్ డి మిషన్గా వ్యవహరిస్తున్న దిగ్గజ షూటర్ గగన్ నారంగ్ వెల్లడించాడు. గురువారం రాత్ర పారిస్ చేరుకున్నా. భారత్ నుంచి మొదటగా ఆర్చరీ, రోయింగ్ బృఎందాలు శుక్రవారం క్రీడా గ్రామంలో అడుగుపెట్టాయి. ఇక్కడ అథ్లెట్లు నెమ్మదిగా కుదురుకుంటున్నారు. పురుషుల హాకీ జట్టు కూడా ఈ గ్రామానికి చేరుకోబోతోంది. అథ్లెట్లు మంచి ఉత్సాహంతో ఉన్నారు. పోటీల వేదికలో ప్రాక్టీస్ చేయాలనుకుంటున్నారు. వాళ్లకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఒలింపిక్స్ కోసం చెఫ్ డి మిషన్గా పారిస్కు రావడం నాకు దక్కిన గౌరవం. భారత అథ్లెట్ల బృఎందంలో స్ఫూర్తి నింపేందుకు ప్రయత్నిస్తా. పతకాలు సాధించే సత్తా ఉన్న భారత అథ్లెట్ల సంఖ్య పెరగడం గర్వంగా ఉంది అని నారంగ్ తెలిపాడు. ఈ ఒలింపిక్స్లో భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు 20 క్రీడాంశాల్లో పోటీపడనున్నారు.

